RNI Regd. APTEL No. 2009/29147 Postal Regd. No. J/NLR/078/20-22

# ఆంధ్రలక్ష్మి

జాతీయ తెలుగు వార పత్రిక



సంపుటి : 15 సంచిక : 35 ఎడిటర్ : ఎస్.కె. గౌస్‌బాషా తేది : 10-05-2024 పేజీలు : 8 వెల : 6/-

## అజెండాల లెక్క తేలింది.. ఇక ప్రజా తీర్పే మిగిలింది..!



ప్రజలు కోరుకున్నవాళ్లే నాయకులు.. ప్రజలు ఎన్నుకున్నదే ప్రభుత్వం. మళ్లీ తమ పాలకులను ఎన్నుకునే అరుదైన చారిత్రక ఘట్టానికి భారతదేశం సిద్ధమైంది. కన్యాకుమారి నుంచి చైనా సరిహద్దులోని 15 వేల అడుగుల ఎత్తులో ఉన్న తాషిగంగ్ వరకూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే రోజు రానే వస్తోంది. అమెరికా, యూరోప్, రష్యా దేశాల జనాభా కలిపితే ఎంత ఉంటుందో అంతకంటే ఎక్కువ మంది సుమారు 97 కోట్ల మంది ఓటర్లతో ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతావనిలో జరుగుతున్న ఓట్ల జాతరను విశ్వమంతా నిశితంగా గమనిస్తోంది. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా, సర్వమత సౌభ్రాతుత్వంతో దశాబ్ధాలుగా ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తూ వస్తోంది. వర్తమానంలో ప్రపంచ ఆర్థికశక్తిగా ఎదిగి.. విశ్వగురుస్థానాన్ని ఆక్రమించడానికి ఉవ్విళ్లూరుతోంది. సరిగ్గా ఈ సమయంలో జరుగుతున్న ఎన్నికలు సహజంగానే ఆసక్తిని రేకిత్తిస్తాయి. అందుకే అజెండాలు, విధానాలు కూడా చర్చనీయాంశాలే. ప్రధానంగా రెండు కూటముల మధ్య జరుగుతున్న ఎన్నికల మహాసంగ్రామంలో అజెండాలు తేలాయి. 2014 నుంచి వరుసగా రెండుసార్లు ఓట్లు, సీట్లు పెంచుకుంటూ వచ్చిన కమలదళం ఇప్పుడు అతిపెద్ద కలను సాకారం చేసుకునేందుకు శక్తినంతా కూడగట్టుకుంటోంది. మోదీయే ఆయుధం.. మోదీయే నినాదంగా చేసుకుని దేశ చరిత్రలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య విజయాన్ని అందుకోవాలన్న ఆశయసాధన వైపు అడుగులేస్తోంది. ఏడుపదుల వయసులోనూ నరేంద్రమోదీ మూడోసారి తిరుగులేని మెజార్టీతో ప్రధానమంత్రి కావాలన్న లక్ష్యం వైపుగా నడుస్తున్నారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే ప్రబలశక్తిగా తీర్చిదిద్దడమే తన అజెండాగా చెబుతున్నారు. కరోనా కారణంగా నిర్దేశిత 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అందుకోలేక పోయినా పదేళ్లు ఇచ్చిన అవకాశంతో ప్రపంచంలోనే ఐదో ఆర్థికశక్తిగా నిలబెట్టిన ఘనత తమదిగా చాటుకుంటోంది బీజేపీ. మరోసారి గెలిపిస్తే అమెరికా, చైనాల తర్వాత అతిపెద్ద పవర్ హౌస్‌గా మారుస్తామంటోంది. 21వ శతాబ్ధంలో భారత్‌ను శాసించే శక్తిగా మార్చి చూపిస్తామని కూడా జనాల్లోకి వస్తోంది. ఇందుకు జీ20 సదస్సును, చంద్రుడిపై అడుగుపెట్టిన చారిత్రక ఘట్టాలను ఉదహరిస్తోంది. కరోనా సంక్షోభాన్ని ఎదుర్కొన్న తీరు.. మోదీ నాయకత్వపటిమ, విదేశాల్లో గుర్తింపు బీజేపీ ప్రచారానికి అదనపు బలాలయ్యాయి. వీటికి తోడు సహజ సిద్దంగానూ, వారసత్వంగానూ వస్తున్న దేశభక్తి, దేశసమగ్రత, దేశరక్షణ వంటి తిరుగులేని ఈ మూడు ఆయుధాలు ఉత్తర భారతంలో ఓట్లు సాధించిపెడతాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కరోనా సమయంలో కడుపు నింపిన ఉచిత బియ్యం, ఫ్రీగా ఇచ్చిన వ్యాక్సిన్ కంటే కూడా బీజేపీకి అతిపెద్ద ప్రచారాస్త్రం ఇప్పుడు జై శ్రీరామ్. బీజేపీకి విజయాన్ని అందించే ఇలవేల్పుగా మారాడు శ్రీరాముడు. 500 ఏళ్ల రామభక్తుల కల నేరవేరడం నిజమే. కానీ కోర్టుల ద్వారా సాధించిన రామాలయం అధికారంలో ఉన్న బీజేపీకి కలిసొచ్చింది. లీడర్, కేడర్ లేని ఊరూ-వాడకు కూడా కాషాయపార్టీని ఆ రాముడే అక్షింతల రూపంలో తీసుకెళ్లడం ఎన్నికలకు ముందు పార్టీ సాధించిన విజయమే. ఎందుకంటే ఇటీవల విశ్వసనీయత కలిగిన ఓ జాతీయసంస్థ జరిపిన సర్వేలో అయోధ్యలో రామమందిరం నిర్మాణం హిందువులు సాధించిన అతిపెద్దగుర్తింపుగా భావిస్తున్నారా అంటే 48 శాతం మంది అవును అనడమే ఇందుకు నిదర్శనం. ఆసక్తికరంగా దక్షణభారతంలోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమయింది. అంటే రామజపం బీజేపీ విజయంతో చోదకమవుతుందనడంలో

(తరువాయి 2వ పేజీలో)

## ఏపీ పాలిటిక్స్‌లో ఓ హాట్ టాపిక్.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్..!




ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్.. ఇప్పుడు ఏపీ పాలిటిక్స్‌లో ఓ హాట్ టాపిక్.. ప్రభుత్వం భూములు గుంజుకునేందుకే ఈ చట్టాన్ని తెచ్చిందని విపక్షాలు. లేదు మీ భూముల పరిరక్షణకే ఈ చట్టమని అధికార పక్షం ఇలా ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. ఇంతకీ ఈ చట్టం అసలు ఉద్దేశమేమంటి..? విపక్షాల విమర్శల్లో నిజమెంత..? అధికారపార్టీ చెబుతున్న మాటలన్ని నిజమేనా..? అసలు ఇప్పుడు ఈ చట్టం ఎందుకు హైలేట్ అవుతుంది. మనకు తెలిసిందే.. ఏపీ పొలిటికల్ నేతలు నిప్పు లేకుండానే అగ్గి రాజేసే రకం. అలాంటిది ఎన్నో అనుమానాలు ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఎక్స్‌పరిమెంటల్‌గా అమలు చేస్తుండటం. అందులో ఒరిజినల్ డాక్యుమెంట్స్ లబ్ధిదారులకు ఇవ్వకపోవడం జరిగితే.. ఊరుకుంటారా అస్సలు ఊరుకోరు. ప్రస్తుతం అదే జరుగుతుంది. ప్రస్తుతం మండిపోతున్న భానుడి భగభగలకన్నా హాట్ హాట్ కామెంట్స్ చేస్తున్నారు నేతలు. మీ భూములు పోతాయి.. మీ భూములపై హక్కులు కోల్పోతారు. భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ అన్ని ప్రభుత్వం దగ్గరే ఉంటాయి. ఇదీ విపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలు మరి అధికార పక్షం ఊరుకుంటుందా విన్న దానికి మరో రెండు పదాలు కలిపి వినిపించడం అలవాటే కదా.. సో అదే స్థాయిలో కౌంటర్లు మొదలయ్యాయి. ఇదీ అధికార, విపక్షాల మధ్య డైలాగ్ వార్.. ఇంతకీ ఈ యాక్ట్‌లో ఏముంది..? అసలు దేని గురించి ఈ యాక్ట్..? ఒక్కసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. ఏపీలో చాలా భూమి ఉంది.. అందులో వ్యవసాయ భూమి.. వ్యవసాయేతర భూమితో పాటు ఇంకా చాలా రకాల భూములుఉన్నాయి. ఈ భూములకు బ్రిటీష్ కాలం నుంచి మొదలు పెడితే ఇప్పటి వరకు రికార్డులు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఏ పంచాయితీ అయినా వచ్చిందనుకోండి. మ్యాగ్జిమమ్ కోర్టులకు వెళ్లరు.. పెద్దల ముందు కూర్చొని మాట్లాడుకొని తేల్చుకుంటారు. ఎందుకు..? కోర్టుకు వెళితే ఏ రికార్డు తవ్వితే ఎక్కడ తేలుతుందో అని భయం. అంటే ఇప్పటికీ చాలా వరకు భూములకు సరైన రికార్డులు లేవు. అందుకే ఈ యాక్ట్‌ను తీసుకొచ్చామని చెబుతుంది కేంద్రం. ఈ చట్టం కింద.. భూమిపై యజమానులకు హక్కు కల్పించి. భవిష్యత్తులో కూడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడటమే అని చెబుతుంది. ఇక్కడే కొన్ని డౌట్స్ ఉన్నాయి. అవేంటంటే.. ఎవరైనా తప్పుడు పత్రాలు చూపించి దానిని రిజిస్ట్రర్ చేసుకుంటే..? ఇక వారికే ఈ భూమి చెందుతుందా? అసలు యజమానులు ఏం చేయలేరా? దీనికి కూడా ఆన్సర్ చెబుతుంది ఈ యాక్ట్.. ముందు భూముల లెక్కలు తేలుస్తారు.. అవి కూడా ఏ వివాదం లేని భూములు టైటిల్ రిజిస్టర్‌లో ఎంటర్ చేస్తారు. వివాదాలు ఉన్న భూములను ఓ స్పెషల్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. వీటి పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ఒక ట్రైబ్యునల్, రాష్ట్ర స్థాయిలో మరో ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తారు.

(తరువాయి 5వ పేజీలో)

www.andhralaxmitelugu.in వెబ్‌సైట్‌లో వార్తలు చూడండి!

# ఇలా అయితే.. ఎన్నికలు సజావుగా జరిగేనా..?



స్వేచ్ఛగా, నిర్భయంగా, ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్యానికి పరిపుష్టి చేకూరుతుంది. అభద్రతతో, భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఏ రోజు ఏం జరుగుతుందో అనే ఆందోళనతో ప్రజలు జీవిస్తుంటే ఓటు హక్కును ఎలా వినియోగించుకుంటారు? దేశ చరిత్రలో 2024లో జరిగే ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను నిర్దేశించబోతున్న అత్యంత కీలకమైనవి. కూటమికి, వైసీపీకు జీవన్మరణ సమస్య. అలాంటి ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించలేకపోతే ప్రజాస్వామ్య అంతిమ యాత్రకు ఎన్నికల సంఘం తమవంతు సహకారం అందించినట్లు అవుతుంది. రాష్ట్రంలో అడుగడుగునా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ వైసీపీ మూకలు, అభ్యర్థులు చెలరేగి పోతున్నారు. ఇప్పటికీ కొన్ని ఎన్నికల కమిషన్ అనుమతి లేకపోయినా ప్రచార వాహనాలు, హెూర్డింగ్స్, బ్యానర్లు, ఫ్లెక్సీలు, పార్టీ రంగులు విచ్చలవిడిగా కనిపిస్తూనే ఉన్నాయి. పైగా జగన్మోహన్ రెడ్డితో పాటు ఆ పార్టీ అభ్యర్థులందరూ వారి సభలు, సమావేశాల్లో ప్రజలను రెచ్చగొట్టే రీతిలో అభ్యంతరకరమైన మాటలు, చేష్టలతో ప్రసంగాలు కొనసాగిస్తున్నప్పటికీ ఎన్నికల కమిషన్ ప్రేక్షకపాత్ర వహిస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ప్రార్థనా మందిరాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించడాన్ని చాలా తీవ్రమైన నేరంగా పరిగణించాలి. చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో వైసీపీ అభ్యర్థులు సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారం చేస్తూనే ఉన్న పట్టించుకోవడం లేదు. చాలా మంది జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది జగన్మోహన్ రెడ్డి కనుసన్నల్లోనే పనిచేస్తున్నారు. ఇక పోలీసు అధికారుల గురించి వేరే చెప్పనక్కర్లేదు. వైకాపా కార్యకర్తల కంటే మరింత స్వామిభక్తిని ప్రదర్శిస్తున్నారు. వైసీపీ ఎన్నికలకు ముందే ఒక పథకం ప్రకారం తన సామాజిక వర్గం, తన చెప్పు చేతల్లో ఉండే అధికారులను ఎన్నికల ప్రక్రియలో చొప్పించారు. వారు తమ పూర్తి సహాయ సహకారాలను వారికి అందిస్తున్నారు. మీడియా సర్టిఫికేషన్, పర్యవేక్షణా కమిటీ(ఎంసీఎంసీ) వారిని రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వైకాపా అనుకూల వ్యక్తులను నియమించారు. వారు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలుచేసి చిత్తశుద్ధితో, నిష్పక్షపాతంగా వ్యవహరించే సుమారు వంద మంది పోలీసు అధికారులను చాలాకాలం వీఆర్‌లో పెట్టి వారిని ఎన్నికల విధులకు దూరం ఉంచారు. సాక్షాత్తూ దేశప్రధాని భద్రతనే ప్రమాదంలోకి నెట్టి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యల కోసం ఎన్నికల కమిషన్ మీనమేషాలు లెక్కపెట్టింది. తర్వాత ఎట్టకేలకు ఆరుగురు పోలీసు అధికారులను ఎన్నికల విధుల నుంచి తప్పించింది. అయినప్పటికీ వారు నివసిస్తున్న బంగ్లాలను ఖాళీ చేయకుండా అక్కడే తిష్టవేశారు. అక్కడున్న సిబ్బందికి, అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూనే ఉన్నారు. తిరిగి వైసీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారు. మరోవైపు ఇంటిలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు, విజయవాడ సీపీ కాంతి రాణాను మాత్రమే బదిలీ చేశారు. సీఎస్‌ను బదిలీ చేయకపోగా.. ఎక్కడో డిఫెన్స్‌లో పనిచేసిన ధర్మారెడ్డికి డిప్యూటేషన్ గడువు పొడిగించారు. పేరుకే టీటీడీ ఈవో. కానీ పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రాభావితం చేస్తున్నారు. ఎన్నికల సంఘానికి వెన్నెముక లేకపోతే ప్రజాస్వామ్యం నిట్టనిలువునా కూలిపోతుంది. ఎన్నికల ప్రక్రియ మొక్కుబడిగా, తూతూమంత్రంగా మారకూడదు. ఎన్నికలు న్యాయబద్ధంగా జరుగుతాయనే నమ్మకం ప్రజల్లో కలిగించాలి. ఎన్నికల వేళ చోటుచేసుకోబోతున్న హింసాత్మక ఘటనలు, ఉద్రిక్తత పరిస్థితులను నిలువరించాలి. పాలకపక్షం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న మద్యం, నగదు, ఇతర ప్రలోభాలను నియంత్రించాలి. ప్రజాస్వామ్యానికి ఊపిరిలాంటి ఎన్నికలను నిర్వహించే స్వతంత్ర ఎన్నికల వ్యవస్థ రాజీపడకూడదన్న సుప్రీంకోర్టు స్ఫూర్తికి పట్టం కట్టాలి. నిబంధనలు ఉల్లంఘించేవారి పట్ల కఠినంగా ఉంటూ వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవాలి. జగన్మోహన్ రెడ్డి విద్వేషపూరిత వ్యాఖ్యల గురించి నిర్దిష్ట సమాచారాన్ని ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. అయిప్ప టికీ ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసు కోకపోవడం నిష్పాక్షికతను ప్రశ్నార్థకం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం పోలీసు ఉన్నతాధికారులను కాపలా దారులుగా పెడుతున్నారు. ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేకుండా భావప్రకటనా స్వేచ్ఛను బంధీ చేసి ఐదేళ్ల పాలన పూర్తిచేశారు. ఇప్పుడైనా ప్రజలు కళ్లుతెరిచి అన్యాయాలను, అకృత్యాలను అడ్డుకోవాలి. శవ, హత్యా రాజకీయాలకు పాల్పడ్డ వారికి గుణపాఠం చెప్పేందుకు సమయం ఆసన్నమైంది. అణచివేతలు అధికమవడంతో తిరుగుబాట్లు తీవ్రమయ్యాయి. ఆ తీవ్రత ఓట్ల రూపంలో మే 13వ తేదీన కనిపిస్తుంది. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓట్లు వేస్తే వైసిపికన్నా... కూటమికే ఎక్కువ ఆధిక్యం వచ్చే అవకాశం వుందని ఓటర్ల అభిప్రాయంగా వుంది..!

## అజెండాల లెక్క తేలింది.. ఇక ప్రజా తీర్పే మిగిలింది..!

(1వ పేజీ తరువాయి)

ఎలాంటి సందేహమూ లేదు. తెలంగాణ వంటి ఉద్యమాల గడ్డలోనూ జైశ్రీరామ్ నినాదం పార్లమెంట్ ఎన్నికల అజెండాలో భాగమైంది అంటేనే బీజేపీ వ్యూహం ఫలించినట్టే. 1984లో ఇందిరా గాంధీ హత్య అనంతరం దేశవ్యాప్తంగా పెల్లుబికిన సానుభూతిలో 48శాతం ఓట్లతో 415 సీట్లు గెలిచింది కాంగ్రెస్. ఇప్పుడు అంతకుమించిన విజయాన్ని అందుకోవాలన్నది బీజేపీ ఆశయం. 50శాతం ప్రజామద్దతుతో 400కు పైగా సీట్లతో అఖండవిజయాన్ని సొంతం చేసుకునేందుకు శత్రువులను సైతం మిత్రులుగా మలుచుకుని సీట్లు సర్దుబాటు చేసుకోవడం ఇందులో వ్యూహమే. అబ్‌కి బార్ 400 పార్ నినాదం కోసమే బీహార్‌లో నితీష్‌కుమార్, ఏపీలో చంద్రబాబునాయుడు, కర్నాటకలో జేడీఎస్ కుమారస్వామి స్నేహితులుగా మారారు. 2019 లో 37శాతం ఓట్లతో 303 సీట్లు సాధించిన బీజేపీ అనుకున్న లక్ష్యం చేరుకోవాలంటే 13శాతం అదనంగా ఓట్లు సంపాదించాలి. దక్షణాదిన సీట్లు పెంచుకోవాలి. 130 సీట్లలో సగానికి పైగా సాధించాలి. దీని కోసమే మోదీ మిషన్ సౌత్ మొదలుపెట్టారు. రాజకీయ వ్యూహాలు ఎలా ఉన్నా నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్స్ట్ అనే భారతీయ జనతా పార్టీ కూడా ఇప్పుడు ప్రాంతీయపార్టీల్లోనే అనూహ్యంగా వ్యక్తులను ముందుపెట్టి మరీ ఎన్నికలకు వస్తోంది. ఫిర్ ఏక్‌బార్ మోదీ సర్కార్.. అంటే స్లోగన్‌లో బీజేపీ స్థానాన్ని ప్రధానమంత్రి మోదీ ఆక్రమించారు. ఇది విమర్శలకు తావిస్తోంది కానీ కేవలం నినాదం మాత్రమేనని.. తమ అజెండా ఉజ్వల భారతమంటోంది. ప్రపంచశక్తిగా నిలపడమే అసలు లక్ష్యమంటోంది. ఇది మోదీ నాయకత్వంతోనే సాధ్యమన్న సందేశమివ్వడమే నినాదం వెనక ఉద్దేశమంటోంది పార్టీ. భారతీయ జనతా పార్టీకి పూర్తి భిన్నమైన అజెండా ఇండియా కూటమిది. దేశ రక్షణ, సమగ్రత, జైశ్రీరామ్, ఆర్థికాభివృద్ధి ఎన్డీయే విధానాలైతే .... సంక్షేమం, ఉచిత పథకాలు, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య వ్యవస్థల పునరుద్దరణ అంటోంది ఇండియా కూటమి. నెహ్రూ, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ ప్రభుత్వాల్లో దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేశామని.. పేదలకు పథకాలు ఇస్తూనే దేశాభివృద్ధికి బాటలు వేశామంటోంది కాంగ్రెస్. మోదీ పాలనతో ఇద్దరు ముగ్గురు పారిశ్రామికవేత్తలు మినహా ఎవరు బాగుపడ్డారని ప్రశ్నిస్తోంది. బీజేపీ ప్రచారం చేస్తున్న అభివృద్ధి అంతా బూటకమేనంటోంది. ఉద్యోగాలు, ఉపాథి కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారని.. 2023లో 44శాతానికి నిరుద్యోగ రేటు పెరిగిందని ఆరోపిస్తోంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు నినాదాలు గుర్తుచేస్తున్నాయి. పెరిగిన ధరలు తప్ప ప్రజలకు జరిగిన మేలు ఏంటని నిలదీస్తోంది. తమ అజెండా సామాన్యుల అజెండా అంటోంది ఇండియా కూటమి. కూడు, గూడు, గుడ్డ నినాదంగా మలుచుకుంది. 5 న్యాయ పత్రాలను ఉచితపథకాలతో నింపింది. ఏడాదికి లక్ష రూపాయల నగదు నుంచి నిరుద్యోగులకు భృతిపైనా భరోసా ఇస్తోంది. ఇక రాజకీయంగా బీజేపీ మళ్లీ గెలిస్తే దేశంలో ప్రజాస్వామ్యమే ఉండదని కాంగ్రెస్ బలంగా చాటుతోంది. రాజ్యాంగాన్ని మార్చి ప్రజలను ఏమార్చి నియంతృత్వ పాలన తీసుకొస్తారని ప్రచారం బలంగా తీసుకొస్తున్నారు. జైశ్రీరామ్ నినాదం వ్యతిరేకించకపోయినా అండర్ కరెంట్‌గా మైనార్టీ ఓటుబ్యాంకు పోలరైజ్ అయ్యేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇక రైతు ఉద్యమాలు, ఉద్యోగాలు లేని యువత అండగా ఉంటారని నమ్ముతోంది ఇండియా కూటమి. అయి తే కూటమి కడుతూనే మోదీని ఢీకొట్టడం అంత ఈజీకాదని కాడి వదిలేశాయి కొన్ని పార్టీలు. రాష్ట్రాలన్నీ తిరిగి విపక్ష పార్టీలను ఏకం చేసి కూటమికి ఆజ్యంపోసిన నితీష్‌కుమార్ కాడి వదిలేసి ఎన్డీయేతో జతకట్టారు. అయినా మిగిలిన పార్టీలు శక్తివంచన లేకుండా పోరాడు తున్నాయి. బీజేపీని 250లోపు పరిమితం చేస్తే చాలు అధికారం దక్కుతుందన్న ఆశతో హస్తం పార్టీ ఉంది. వాస్తవానికి మళ్లీ నరేంద్రమోదీ – అమిత్‌షా ద్వయం సారథ్యంలో ఎన్డీయే గెలిస్తే ప్రాంతీయ పార్టీల ఉనికే లేకుండా చేస్తారన్న అనుమానాలున్న పార్టీలు కూడా ఇండియా కూటమికి ఎన్నికల అనంతరం మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయి. ఉత్తరభారతంలో బీజేపీ బలం తగ్గించి.. దక్షణభారతంలో తమ పట్టు నిలబెట్టుకోవాలన్న వ్యూహంతో ఉంది ఇండియా కూటమి. బీజేపీతో 350 నుంచి 400 సీట్లలో నేరుగా తలపడుతోంది. మరి ఉచితపథకాలతో పాటు.. రాజకీయ వ్యూహం ఫలించి అజేయశక్తిగా, రోజురోజుకు ఇమేజ్ పెంచుకుంటున్న నరేంద్రమోదీని ఢీకొట్టగలరా అన్నదే ఇప్పుడు ప్రశ్న. వాస్తవానికి ఇండియా కూటమి ఇప్పుడు పోరాడుతున్నది ఎన్డీయే లేదా బీజేపీతో కాదు.. ఇండియా కూటమిది కమీషన్ నినాదం.. మాది ఇండియా మిషన్ అని మోదీ అంటున్నారు. పోటీగా మాది ప్రజాస్వామ్య పాలన, ఎన్డీయేది నియంతృత్వ పాలన అంటోంది ఇండియా కూటమి. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముస్లిం లీగ్ ముద్ర ఉందని నరేంద్రమోదీ నేరుగానే విమర్శలు గుప్పించారు. బీజేపీ చెప్పుకోవడానికి ఏమీలేకనే జైశ్రీరామ్ అంటోందని కాంగ్రెస్ అంటోంది. ఇది పక్కనపెడితే ఎన్నికల్లో ఈడీ, సీబీఐ, ఐటీ, ఎన్నికల సంఘం వంటి వ్యవస్థలు కూడా పార్టీలకు ప్రచారాస్త్రాలుగా మారడం దురదృష్టకరం. అధికారపార్టీకి అవి అనుబంధ సంస్థలుగా మారాయంటూ విపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్యంలో ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. రాజకీయ పార్టీలే వీటికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. మొత్తానికి ఎవరు ఎన్ని అజెండాలతో, విమర్శలు, హామీలు, నినాదాలతో వచ్చినా ప్రజలే అంతిమనిర్ణేతలు. వారు అన్నీ గమనిస్తూనే ఉంటారు.. ఎప్పుడు ఎలాంటి తీర్పు ఇవ్వాలో వారే నిర్ణయించుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నుకునేది తమ సేవలకుని.. ప్రభువులను కాదని ప్రజలకు తెలుసు. అందలం ఎక్కించినవారు నచ్చితేనే మళ్లీ పట్టం కడతారు.. లేదంటే పక్కకు నెడతారు. అదే ప్రజాస్వామ్యంలో ఉండే బ్యూటీ. సో... ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల్లో ఎవరికి అధికారం ఇవ్వబోతున్నారో తెలియాలంటే జూన్ 4వరకు ఆగాల్సిందే..!

# విద్య... ధనవంతులు... బలవంతుల చేతిలోకి వెళ్లిపోయింది..!



సర్వ వ్యవస్థలు నాశనమైనా, విద్యా వ్యవస్థ బాగుంటే ఆశాజనకంగా ఉంటుంది. అది కూడా రోగగ్రస్తం అయితే, ఆ దేశానికి ఇక ముక్తి మార్గం ఉండదు. విద్య ఒక వ్యాపారం అయి పోయి చాన్నాళ్లయింది. దాని దుష్ప్రభావం మనం అనుభవిస్తున్నాము. విద్యావంతుల చేతుల్లోంచి, ధనవంతులు, బలవంతుల చేతుల్లోకి విద్య వెళ్ళిపోయింది. ధనార్జనే విద్యాసంస్థల ఏకైక లక్ష్యం అయిపోయింది. అన్ని సమస్యలకూ మూలం అవిద్య. అంత కంటే ప్రమాదకరమైనది అక్రమ విద్య. అన్ని సమస్యలకూ పరిష్కారం విద్య. ఆలోచనా విధానం, దాని ద్వారా జీవన విధాన మార్గదర్శనం చేసేదే విద్య. విద్య అంటే ఏమిటి? చాలా మందికి విద్య అంటే – బడికి వెళ్లడం, తర్వాత కళాశాలకి, విశ్వవిద్యాలయానికి వెళ్ళటం, ఉద్యోగం సంపాదించడం ఇలా చాలా మందికి విద్య అంటే – భుక్తి మార్గం. విద్య పరమార్థం ఉద్యోగం సంపాదించటం. అది ఆశ్చర్యకరం కాదు. ఎందుకంటే జీవిత పరమార్థమే డబ్బు సంపాదించటం అయిపోయింది. విద్య దానికి మార్గమైంది. కొంత కాలం వరకు సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు ప్రియంగా ఉండేవి. ఆ రంగం ఒడిదుడుకులని ఎదుర్కోవడంతో, ఇప్పుడు భద్రతాపరంగా ప్రభుత్వ ఉద్యోగాలకి అర్రులు చాస్తున్నారు. తక్షణ సుఖం ముఖ్యం, దీర్ఘకాల ప్రయోజనాలు అనవసరమై పోయాయి. ఇది జీవన దృక్పథంలో లోపం. విద్య అనేది ఈ ఆలోచనా విధానాన్ని సవరించేదిగా ఉండాలి, కానీ విద్య కూడా ఈ లోపభూయిష్ఠ జీవన దృక్పథానికి బాధితురాలు అయిపోయింది. సర్వ వ్యవస్థలు నాశనమైనా, విద్యా వ్యవస్థ బాగుంటే ఆశాజనకంగా ఉంటుంది. అది కూడా రోగగ్రస్తం అయితే, ఆ దేశానికి ఇక ముక్తి మార్గం ఉండదు. విద్య ఒక వ్యాపారం అయిపోయి చాన్నాళ్లయింది. దాని దుష్ప్రభావం మనం అనుభవిస్తున్నాము. విద్య విద్యావంతుల చేతుల్లోంచి, ధనవంతుల బలవంతుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ధనార్జనే విద్యాసంస్థల ఏకైక లక్ష్యం అయిపోయింది. నిన్న ఒక విద్యార్థిని మార్గనిర్దేశనం చేయమని, సలహా ఇమ్మని అతని తండ్రి అభ్యర్థించారు. తెలంగాణ పదో తరగతి పరీక్షల్లో అతనికి 9.3 సిజిపిఏ వచ్చింది. ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థలో చదువుకున్నాడు. నాలుగు చిన్న ప్రశ్నలు వేసాను. నాలుగు కూడా తప్పు చెప్పాడు. అందులో ఒకటి – 350 లో 14% ఎంత అని. కాగితం, కలం ఉపయోగించి సమయం తీసుకుని. నిదానంగా ఆలోచించి చేయమని చెప్పాను. 301 అని చెప్పాడు. సాయం చేద్దామనే ఉద్దేశంతో ఎలా వచ్చిందని అడిగాను. తప్పు గ్రహించి సరిదిద్దు కుంటాడేమోనని. సవరించుకోలేదు సరి కదా, ఆ సమాధానం సమర్థించుకుంటూ జవాబిచ్చాడు. ఇదీ మన విద్య పరిస్థితి. వీళ్ళే రేపు డాక్టర్లు అవుతారు, ఇంజినీర్లవుతారు, పోలీసులు అవుతారు, లాయర్లవుతారు, నాయకులవుతారు. అదే మన దేశం ముందున్న పెను ప్రమాదం. ఇటువంటి చదువు వల్ల ఉపయోగం లేకపోవడమే కాకుండా, తీరని నష్టం జరుగుతుంది. సమయం మించి పోకముందే నష్ట నివారణ చర్యలు తీసుకోవాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం ఉపయోగం? అన్ని సమస్యలకూ మూలం అవిద్య. అంత కంటే ప్రమాదకరమైనది అక్రమ విద్య. అన్ని సమస్యలకూ పరిష్కారం విద్య. ఆలోచనా విధానం, దాని ద్వారా జీవన విధాన మార్గదర్శనం చేసేదే విద్య.

## ఆ సైకిల్‌కు హ్యాండిల్ లేదు.. చక్రాలు లేవు, పెడల్స్ లేవు : జగన్



ఆ సైకిల్ కు హ్యాండిల్ లేదు.. చక్రాలు లేవు, పెడల్స్ లేవు.. ఎన్ని రిపేర్లు చేసినా లాభం లేదు.. సైకిల్ లో పనిచేసే ఒకే ఒక్క పార్ట్ బెల్.. అది మేనిఫెస్టోలోని అబద్ధాలను ప్రచారం చేస్తుందని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. రాజనగరం నియోజకవర్గంలోని కోరుకొండలో సీఎం జగన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. తుప్పు పట్టిన సైకిల్ కు రిపేర్ చేయించాలని చంద్రబాబు అవస్థలు పడుతున్నారన్నారు. సైకిల్ రిపేర్ చేయడానికి దత్త పుత్రుడిని ఆశ్రయించినా ఫలితం రాలే.. ఆ తర్వాత వదినమ్మను ఢిల్లీకి పంపి సైకిల్ రిపేర్ కు చంద్రబాబు యత్నాలు చేశారు.. ఢిల్లీ మెకానిక్ లు ఇప్పుడు ఇక్కడికి వచ్చారు.. సైకిల్ కు ఎన్ని రిపేర్లు చేసినా లాభం లేదు.. ఆ సైకిల్ కు హ్యాండిల్ లేదు.. చక్రాలు లేవు, పెడల్స్ లేవు.. ఎన్ని రిపేర్లు చేసినా లాభం లేదు.. సైకిల్ లో పనిచేసే ఒకే ఒక్క పార్ట్ బెల్.. అది మేనిఫెస్టోలోని అబద్ధాలను ప్రచారం చేస్తుందని ఆయన అన్నారు. మేనిఫెస్టోతో ఊదరగొడుతున్న చంద్రబాబు గతంలో ఎన్ని హామీలు నెరవేర్చావంటూ ప్రశ్నించారు. ఢిల్లీ వాళ్లతో కుట్రలు చేయిస్తు పథకాలు ఆపుతున్నారని ఆయన ఆరోపించారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు పేరు చెబితే ఏ ఒక్క పథకం పేరైనా గుర్తొస్తుందా? అని ఆయన అన్నారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చామని జగన్ అన్నారు. 'రాబోయే ఐదేళ్ల భవిష్యత్తును ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయి. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే చంద్రబాబును నిద్రలేపడమే అవుతుంది. టీడీపీకి ఓటు వేస్తే పథకాల ముగింపే. 59 నెలలో ఎప్పుడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఐదేళ్లలో 2 లక్షల 31 వేల ఉద్యోగాలిచ్చాం. అవ్వా తాతలకు ఇంటికే రూ. 3 వేల పెన్షన్, రేషన్, పౌర సేవలు. నాడు–నేడుతో ప్రభుత్వ బడులు బాగుపడ్డాయి. పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్, ఆర్బీకే వ్యవస్థ. స్వయం ఉపాధికి అండగా నిలిచాం. రైతు రుణమాఫీ, పొదుపు సంఘాల రుణాల మాఫీ చేశాం. వివధ పథకాల ద్వారా రూ. 2.70 లక్షల కోట్లను డీబీటీ ద్వారా అందించాం. ఏ పథకం ఎప్పుడు వస్తుందో.. ఏకంగా క్యాలెండర్ ఇచ్చింది మీ బిడ్డనే పాలనలోనే. మళ్లీ జగనే వస్తాడు.. మీ పథకాలన్నీ అందిస్తాడు' అంటూ ఆయన పేర్కొన్నారు. 'టీడీపీ వాళ్లు డబ్బులు ఇస్తే తీసుకోండి.. అవి మీ దగ్గర నుంచి దోచుకున్న డబ్బే. కానీ, ఎవరు అధికారంలో ఉంటే మంచి జరుగుతుందోననేది మీ ఇంట్లో చర్చించి ఓటేయండి' అంటూ జగన్ అన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో వేడెక్కిన ప్రచారం... ఇంకా మిగిలింది 3 రోజులే...!



తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారాల్లో హోరెత్తుతోంది. ఇక మిగిలింది 3 రోజులే ఉండడంతో ఢిల్లీ నుంచి అగ్రనేతలు మొదలుకొని రాష్ట్రంలోని స్టార్ క్యాంపెయినర్లు అంతా ప్రచార రంగంలోకి దూకారు. పోటాపోటీగా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో దూసుకుపోతున్నారు. ఇవాళ ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాల్లో ప్రచారం చేయనున్న సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి 3 రోజులే ఉండడంతో.. ఈ సమయాన్ని ఎంతగా వినియోగించుకుంటే అంత మంచిది అన్నట్లు పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. క్షణం తీరిక లేకుండా సీనియర్ నేతలంతా జిల్లాలను చుట్టేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రోజుకు మూడు ప్రచార సభల్లో పాల్గొంటున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. సాలూరులో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని సీఎం తెలిపారు. ఉత్తరాంధ్రలో కొత్తగా 3 మెడికల్ కాలేజీలు కడుతున్నామన్నారు. అలాగే కూటమి నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడుతూ సీఎం జగన్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా జోరుగా ప్రచారం చేస్తున్నారు. కరీంనగర్‌లో జరగాల్సిన రాహుల్ ప్రచారం గాలివానతో రద్దయింది. రోడ్‌షోలో మాట్లాడిన సీఎం రేవంత్.. ఆర్ఆర్ ట్యాక్స్ అని ఆరోపణలు చేస్తున్నవారే.. దానికి సమాధానం చెప్పాలన్నారు. ముందు కేటీఆర్, తర్వాత బీజేపీ వాళ్ళు ఎత్తుకున్నారని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో బీజేపీ,బీఆర్ఎస్‌కు అన్ని నిధులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్రలతో గులాబీ శ్రేణులలో జోష్ పెంచుతున్నారు. మెదక్ జహీరాబాద్‌లో జరిగిన రోడ్‌షోలో కేసీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఒక్కటి అమలు చేయలేదని.. ప్రజలను రాచిరంపాన పెడుతోందని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని మోదీ సర్కారు వల్ల అచ్చేదిన్ కాదు.. సచ్చేదిన్ వచ్చాయని ఎద్దేవా చేశారు. ఇలా ఎక్కడికక్కడ ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. ఢిల్లీ అగ్రనేతలు కూడా తెలుగు రాష్ట్రాల్లో వాలిపోయారు. కాంగ్రెస్, బీజేపీ జాతీయ నేతలు కూడా జిల్లాలను చుట్టేస్తున్నారు. తెలంగాణ ఎన్నికల ప్రచారాని వచ్చిన ప్రధాని మోదీ.. హైదరాబాద్‌లో ల్యాండ్ అయ్యారు. ఇవాళ వేములవాడ, వరంగల్ ప్రచార సభలలో ప్రసంగించనున్నారు. 6వ తేదీన ఏపీలో పర్యటించిన ప్రధాని.. నేడు మరోసారి ఏపీలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించనున్నారు. రాజంపేట పార్లమెంట్ పీలేరు నియోజక వర్గం కలికిరిలో ఎన్డీఏ భారీ బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగించనున్నారు. అటు కాంగ్రెస్ నేతలు కూడా జోరుగా ప్రచారం చేస్తున్నారు.

# 2024 ఎన్నికలు టీడీపీ భవిష్యత్తును డిసైడ్ చెయ్యబోతున్నాయా...?

నారా చంద్రబాబు నాయుడు... టీడీపీ అధినేత... ఏపీ రాజకీయాల్లోనే కాదు.. దేశ రాజకీయాల్లో కూడా సుదీర్ఘ అనుభవం ఉన్న నేత. తన రాజకీయ చాణక్యంతో ఎన్నో సంక్షోభాల నుంచి పార్టీని కాపాడుకుంటూ వచ్చిన ఆయన... ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, అలాగే విభజన తర్వాత కూడా తనదైన శైలిలో పాలించిన నేత. అయితే ఇన్నాళ్లు ఆయన ఎదుర్కొన్న పరీక్షలు వేరు.. మరి కొద్ది రోజుల్లో ఆయన ఎదుర్కోబోతున్న పరీక్ష వేరు. నిజానికి మే 13న జరగబోయే ఎన్నికలు ఆయన పార్టీ భవిష్యత్తునే కాదు, ఆయన రాజకీయ భవిష్యత్తును కూడా నిర్ణయించబోతున్నాయి. మరి ఈ విషయం ఆయనకు కూడా తెలుసా..? అందుకేనా అంతగా కష్టబడుతున్నారు..? ఒక వేళ ఆయన అనుకున్న ఫలితం రాకపోతే... వాట్ నెక్స్ట్..?



నారా చంద్రబాబు నాయుడు... టీడీపీ అధినేతగా దేశం మొత్తం తెలిసిన పేరు. పేరుకు ప్రాంతీయ పార్టీ అయినా.. ఒకప్పుడు దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన వ్యక్తి. ఎన్డీఏ కన్వీనర్గా... దేశానికి రాష్ట్రపతిగా ఎవరుండాలి ? ఎవరు లోక్ సభకు స్పీకర్గా ఉండాలి... ఏ పార్టీని అప్పటి ఎన్డీఏలోకి ఎలా తీసుకురావాలి... ఇలా కేవలం రాజకీయాలు మాత్రమే కాదు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సందర్భంలో హైటెక్ సిటీ నిర్మాణంతో, బిల్ గేట్స్, బిల్ క్లింటన్ వంటి మహా మహుల్ని హైదరాబాద్ రప్పించిన ముఖ్యమంత్రిగా... విజన్ 2020, జన్మభూమి, ఆర్థిక సంస్కరణలు ఒక్కటి కాదు రెండు కాదు.. అటు రాజకీయంగా, ఇటు పాలనా పరంగా.. దేశ వ్యాప్తంగా ఏపీ పేరును, మరీ ముఖ్యంగా హైదరాబాద్ పేరు మారు మోగించిన వ్యక్తిగా కూడా ప్రఖ్యాతి చెందిన వ్యక్తే. ఆయనంటే నచ్చని వాళ్లు.. ప్రత్యర్థులు ఆయన గురించి రకరకాలుగా చెప్పుకుంటూ ఉంటారు, అది వేరే విషయం. నిజానికి ముఖ్యమంత్రి పదవి ఆయనకు కొత్త కాదు.. అప్పట్లో అంటే ఆయన దేశ రాజకీయాల్లో పెత్తనం చెలాయించిన రోజుల్లో ప్రధానిగా కూడా పగ్గాలు చేపట్టే ఛాన్సొచ్చిందని అయినా రాష్ట్రం కోసం కాదనుకున్నారని సందర్భం వచ్చినప్పుడల్లా ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు చెబుతుంటారు. ఉమ్మడి ఏపీకి సీఎంగా పని చేశారు. విభజన తర్వాత కూడా ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా పని చేశారు. అయితే ఇది గతం.. ఐదేళ్లుగా ఆయన పార్టీ ప్రతిపక్షంలోనే ఉంది. ఆయన చుట్టూ అవినీతి కేసులు చుట్టుముట్టాయి. జీవితంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా జైలుకెళ్లారు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 50 రోజులకు పైగా జైల్లోనే ఉన్నారు. ఎప్పుడూ ఎదుర్కొనంత బలమైన శత్రువు, అదీ అధికారంలో ఉన్న శత్రువు ఆయన పార్టీని అంతమొందిస్తానని శపథం చేసి మరీ బరిలో దిగి సై అంటే సై అంటున్నారు. తనకన్నా వయసులో 23 ఏళ్లు తక్కువున్న ఓ యువ నాయకుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో ఇప్పుడు తలపడుతున్నారు చంద్రబాబు. ఒకప్పుడు ఆయన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి దీటైన ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు.. ఇప్పుడు అంతకన్నా బలమైన నాయకునిగా చెలామణీ అవుతున్న ఆయన బిడ్డ వైఎస్ జగన్తో తలపడాల్సి రావడం, అదీ ప్రతిపక్షంలో ఉండి పార్టీ కోసం పోరాడాల్సి రావడం.. నిజంగా విధి విచిత్రమే. ఆంధ్రప్రదేశ్లో ఇప్పుడు ఒకప్పటి రాజకీయం నవడటం లేదు. కేవలం 2 పార్టీల మధ్య మాత్రమే పోటీ లేదు. అప్పట్లో ఏపీ రాజకీయాలంటే అయితే కాంగ్రెస్, లేదా టీడీపీ ఈ రెండు పార్టీల మధ్యే ఫైట్ ఉండేది. అందుకే పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి కూడా పార్టీని బతికించుకోవడం, తిరిగి అధికారంలోకి తీసుకురాగలగటం చంద్రబాబుకు సాధ్యమయ్యింది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఇప్పుడు కాకపోతే వచ్చే ఎన్నికల్లో చూసుకుందాంలే అనుకునేందుకు చంద్రబాబేం జగన్లా, పవన్ కల్యాణ్లా ఐదు పదుల వయసులో లేరు. ఇప్పుడు ఆయన వయస్సు అక్షరాల 74. అందుకే ఈ ఎన్నికలు టీడీపీకి అంత క్రూషియల్. ఒక వేళ ఇప్పుడు టీడీపీ గెలవకపోతే.. 2024 తర్వాత పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందో ఎవ్వరికీ తెలీదు. 2029 ఎన్నికలొచ్చేసరికి చంద్రబాబు వయసు 79కి చేరుకుంటుంది. అందుకే త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలిచి ఆంధ్రప్రదేశ్లో అధికారంలోకి రావడం చంద్రబాబుకు ముఖ్యం. ఇప్పుడు అధికారంలోకి రాకపోతే చంద్రబాబు రాజకీయ జీవితం దాదాపు ముగిసినట్టే. ఇది ఆయన అభిమానులకు, కార్యకర్తలకు కష్టం కల్గించే మాటే అయినా... నమ్మక తప్పని చేదు నిజం. విశేషమేంటంటే... ఈ విషయం ఆయనకు కూడా తెలుసు. అందుకే ఈ ఎన్నికల్లో విజయం కోసం ఆయన అంతగా కష్టబడుతున్నారు. ఆరేళ్ల క్రితం ప్రత్యేక హోదా పేరుతో ఏ మోదీనైతే తిట్టిపోశారో.. ఇప్పుడు అదే మోదీతో చేతులు కలిపారంటే.. అది కూడా గత ఎన్నికల్లో నోటా కన్నా తక్కువ ఓట్లు వచ్చిన బీజేపీతో పొత్తు పెట్టుకున్నారంటే కారణం అదే. గెలుపుకోసం కలిసొచ్చే ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టకూడదనే. ఇక పార్టీ విషయానికొద్దాం. టీడీపీ పుట్టినప్పటి నుంచి ఎన్నో రాజకీయ సంక్షోభాలను చూసింది. సాక్షాత్తు పార్టీ పెట్టిన అన్నగారు ఎన్టీఆర్ చేతుల్లోంచే అనుహ్య పరిణామాల మధ్య చేజారిపోయింది. వైస్రాయ్ హోటల్ సాక్షిగా జరిగిన పరిణామాలు.. పార్టీని ఎటు తీసుకెళ్తాయో అనుకున్నారు అభిమానులు. ఆ తర్వాత చంద్రబాబు తన రాజకీయ చాణక్యాన్నంతా ఉపయోగించి పార్టీ మొత్తాన్ని తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. ఈ విషయంలో ఎన్ని విమర్శలు ఎదురైనా పెద్దగా పట్టించుకోలేదు. నిజానికి వైశ్రాయ్ ఎపిసోడ్ టీడీపీ దృష్టిలో, ఆ పార్టీ నేతలు, కార్యకర్తల దృష్టిలో కాలం చెల్లిన కథ. ఆ ఎపిసోడ్ తర్వాత ఆయన సుమారు 9 ఏళ్ల పాటు ఉమ్మడి ఏపీని పాలించారు. 2004లో వైఎస్ పాదయాత్రతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంతో టీడీపీకి కష్టాలు మొదలయ్యాయి. ఆ కష్టాలను చంద్రబాబు తన వస్తున్నా మీ కోసం పాదయాత్రతో అధిగమించగల్గారు. 63 సంవత్సరాల వయసులో 208 రోజుల పాటు నాటి ఉమ్మడి రాష్ట్రంలో 16 జిల్లాలు, 86 అసెంబ్లీ నియోజకవర్గాలు, 162 మండలాలు, 28 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లు, 1289 గ్రామాల గుండా 2,817 కిలోమీటర్లు నడిచారు. ఆ తర్వాత రాష్ట్ర విభజన... అప్పుడే విడిపోయిన ఆంధ్రప్రదేశ్ను గాడిన పెట్టేందుకు చంద్రబాబు అనుభవం పనికొస్తుందని ఏపీ జనాలు బలంగా నమ్మడం అందుకు పవన్ కల్యాణ్, అటు మోదీ గాలి కూడా దేశ వ్యాప్తంగా వీయడంతో విభజిత ఏపీకి తొలి సీఎంగా చంద్రబాబు రావడం, తిరిగి టీడీపీకి మంచి రోజులు రావడం చక చకా జరిగిపోయాయి. అధికారంలో ఉన్న పార్టీకి అడ్డేముంటుంది..? అందుకే తన వారసుణ్ణి కూడా రంగంలోకి దించేశారు. అంతకుముందు 2009 ఎన్నికల్లో టీడీపీ కోసం ఖాకీ చొక్కా వేసుకొని మెడలో పసుపు కండువా వేసుకొని రాష్ట్రమంతా తిరిగి ఎన్టీఆర్ను కాదని, పార్టీలో చంద్రబాబు తనయుడు లోకేష్కు ప్రాధాన్యం ఇవ్వడం మొదలయ్యింది. ఆ విషయంలో విమర్శల్ని చంద్రబాబు పెద్దగా పట్టించుకోలేదు. అధికారంలో ఉండటంతో అటు జనాలకు ఇటు పార్టీకి లోకేష్ను అలవాటు చేసేశారు చంద్రబాబు. అయితే ఆయన తర్వాత పార్టీని నడపే సత్తా లోకేష్కి ఎంత మేర ఉందన్నది కాలం చెప్పాల్సిన సమాధానం. లోకేష్ గురించి బాగా తెలిసిన వాళ్లు పాదయాత్ర ముందు లోకేష్.. పాదయాత్ర తర్వాత లోకేష్ అంటూ ఉంటారు. పాదయాత్ర తర్వాత, జనంలోకి వెళ్లిన తర్వాత ఆయన శైలి చాలా వరకు మారిందన్నది ఆయన్ను బాగా దగ్గరగా చూసిన వ్యక్తులు చెప్పే మాట. అదీగాక.. పార్టీకి, చంద్రబాబుకు బాగా సన్నిహితులు.. దేశ, రాష్ట్ర రాజకీయాలపై తనదైన మార్కులో వారం వారం విశ్లేషణ చేసే ఓ ప్రముఖుని వద్ద సుమారు 5-6 నెలల పాటు శిక్షణ తీసుకొని రాటుదేలారని, ఆ తర్వాత లోకేష్లో చాలా వరకు మార్పొచ్చిందని కూడా చెప్పుకుంటూ ఉంటారు. బహుశా ఆ విషయం టీడీపీ ప్రత్యర్థులకు కూడా తెలిసినట్టే కనిపిస్తోంది. నిన్న మొన్నటి వరకు ఆయన్ను రక రకాలుగా హేళన చేసే వాళ్లు ఇప్పుడు ఆ తరహా పదాలను పెద్దగా వాడటం లేదు. అయితే రాజకీయంగా ఎంత పరిణితి సాధించినా... చంద్రబాబు అనుభవం, రాజకీయ చాణక్యంతో పోల్చినప్పుడు ముమ్ముందు లోకేష్ ఎలా తనను తాను నిరూపించుకుంటారన్నది ప్రస్తుతానికి క్వశ్చన్ మార్క్. అయితే నిన్న మొన్నటి వరకు పార్టీ పరంగా చాలా యాక్టివ్గా ఉన్న లోకేష్ ఇప్పుడు కేవలం తాను పోటీ చేస్తున్న మంగళగిరి నియోజకవర్గానికే పరిమితం అయినట్టు కనిపిస్తోంది. ఏపీలో మూడు పార్టీల మధ్య పొత్తు కుదిరినప్పటి నుంచి లోకేష్ పాత్ర కాస్త పరిమితం అయినట్టు కనిపిస్తోంది. బహుశా మంగళగిరి నుంచి ఎలాగైనా విజయం సాధించాలని పట్టుదలతో ఉన్న ఆయన.. తన దృష్టి మొత్తాన్ని అక్కడే కేంద్రీకరించినట్టున్నారు. అదే సమయంలో టీడీపీకి అల్లుడి గండం కూడా పొంచి లేదని చెప్పలేం. గతంలో ఎన్టీఆర్కి అది అనుభవమయ్యింది. ప్రస్తుతం విజయాలు సాధిస్తూ వెళ్తున్నంత సేపూ టీడీపీ చంద్రబాబు నాయకత్వంలో ఉన్నా.. లోకేష్ నాయకత్వంలో ఉన్నా పెద్దగా ఇబ్బంది లేదు. కానీ ఈ సారి ఎన్నికల్లో గెలుపు సాధించకపోతే మాత్రం టీడీపీకీ మరోసారి అల్లుడి గండం వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదన్నది గత కొన్నేళ్లుగా మీడియాలో తరచు వచ్చే కథనాల బట్టీ అర్థమవుతోంది. అయితే ప్రస్తుతానికి జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాలకు దూరంగా ఉండటం, అలాగే తానెంచుకున్న రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ నటునిగా ప్రశంసలందుకుంటున్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు ఆ పరిస్థితి ఉండకపోవచ్చు. అదే సమయంలో రెండు కుటుంబాల మధ్య కొన్నాళ్లు నడుస్తున్న కోల్డ్ వార్ కొలిక్కొస్తే అది పార్టీకి కూడా మరింత కలిసొచ్చే అంశమే. అలా కాకుండా దూరం మరింత పెరిగితే... భవిష్యత్తులో టీడీపీకి ఆయన అవసరం వస్తే అప్పుడు పరిస్థితి వేరుగా ఉండొచ్చు. అయితే చంద్రబాబును జైల్లో ఉన్నప్పుడు జూనియర్ ఎన్టీఆర్ కానీ, ఆయన సోదరుడు కల్యాణ్ రామ్ కానీ కనీసం స్పందించలేదు. ఆ పరిణామాలు చూసిన వారికి రెండు కుటుంబాల మధ్య సంబంధాల విషయంలో మరింత అనుమానాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఓ సారి జనంలోకెళ్లి తన రాజకీయంగా సత్తా ఏంటో జూనియర్ చూపించారు కూడా. ఆ తర్వాత పూర్తిగా లకే తన సమయాన్ని కేటాయించినా... ఒక వేళ రాబోయే ఎన్నికల్లో టీడీపీ చతికిలపడితే మాత్రం... పరిస్థితులు ఇప్పుడున్నట్టు ఏ మాత్రం ఉండకపోవచ్చన్న వాళ్లూ లేకపోలేదు. చంద్రబాబు తర్వాత ఎవరు అన్న ప్రశ్న వచ్చినప్పుడు.. లోకేష్-ఎన్టీఆర్ మధ్యలో పోలిక వచ్చినప్పుడు మాత్రం పార్టీలో పరిణామాలు ఎటు నుంచి ఎటు మారుతాయో కూడా చెప్పలేం. అందుకే చంద్రబాబు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. కచ్చితంగా గెలవాలి. గెలిచి తీరాలి. లేదంటే ఆ తర్వాత పార్టీ పరిస్థితి ఎలా ఉండబోతోందో.. అందరికన్నా ఆయనకే ఎక్కువ తెలుసు.!

## ఫీడ్ బ్యాక్ టు ఆంధ్రలక్ష్మి

'ఆంధ్రలక్ష్మి' వారపత్రికకు సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలు మీ దృష్టికి వస్తే మాకు తెలియజేయండి.... మేము నిర్భయంగా ప్రచురిస్తాం... మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం.

Cell : 9640300529

వార్తలకై www.andhralaxmitelugu.in చూడండి

email : Andhralaxminews@gmail.com
www. andhralakshmi@gmail.com, facebook.com/andharalaxmi

# భయం... కూటమికా.. వైసీపీ పార్టీకా..?



ఆంధ్రప్రదేశ్లోని ఎన్నికలు రోజురోజుకి ఎలా మలుపు తిరుగుతున్నాయో చెప్పలేని పరిస్థితి ఉన్నది.. గత ఐదేళ్ల నుంచి కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ అన్ని రకాలుగా సహకరిస్తూ ఉండడంతో తన దూకుడుని బాగా చూపించారు జగన్.. గడిచిన కొద్ది రోజుల వరకు సీన్ అలాగే ఉన్న ది. అయితే ఇప్పుడు పరిస్థితి ఒక్కసారిగా మారింది.. మొదట ఏపీకి వచ్చినప్పుడు మోడీ కూటమి సభలో మాట్లాడినప్పుడు కూడా జగన్ పేరు ఎత్తకుండానే వెళ్ళిపోయారు.. దీంతో వైసిపి పార్టీకి బిజెపి సహకరిస్తొందని చాలామంది టిడిపి నేతలు నిరుత్సాహంతో ఉన్నారు. అయితే అనంతపురం జిల్లాకు అమిత్ షా వచ్చిన తర్వాత ఒకసారిగా సీను మారిపోయింది.. అలా అమిత్ షా వెళ్లిన వెంటనే రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి పైన కూడా వేపివేయడం జరిగింది. ఇది ఊహించని పరిణామమే అయినప్పటికీ ఇంకా ఎన్నికలకు వారం రోజులు మాత్రమే ఉండడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి తమకు సహకారం బాగా లభిస్తుందని అనుకున్న జగన్ డీజీపీ పైన వేటు వేయడంతో ఆశ్చర్యపోయారు.. అధికారు లను మార్చడం విషయంలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ పురందేశ్వరి సక్సెస్ అయ్యారని కూడా చెప్పవచ్చు. అధికారులను మార్చడం వల్ల ఎన్ని కల వేళ సక్రమంగా కాకుండా తమకు అను కూలంగా జరిపేయాల ప్లాన్ చేసుకున్నట్లు కూటమి భావిస్తోంది. కేవలం వైసీపీ పార్టీ పైన నిన్నటి రోజున మోడీ కూడా ఆరోపణలు చేయడం ఇందులో భాగమేనని చంద్రబాబు ఇచ్చిన స్కిట్లు చదివే మోది మాట్లాడారన్నట్లుగా కనిపి స్తోంది. అలాగే పథకాలు ప్రజలకు అందకుండా చేస్తున్నారని కావాలని అందరిని మార్చేస్తూ ఇల చేస్తున్నారనే విధంగా జగన్ మాట్లాడడం జరిగింది. కేవలం ఈ కుట్రలు చూస్తూ ఉంటే జగన్ పైన కూటమి మొత్తం యుద్ధాన్ని ప్రకటించిన విధంగా భావించవచ్చు. ఆంధ్రప్రదేశ్లోని ప్రభుత్వ పథకాలకు కేంద్ర ఎన్నికల సంఘం కూడా బ్రేక్ వేసింది. ఎన్నికల పూర్తి అయ్యేవరకు ఇలాంటి నిధులను విడుదల చేయకూడదని కూడా తెలియజేసింది.. ముఖ్యంగా రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, విద్యార్థులకు ఫీజ్ రిమెంబర్స్ ఇతర పథకాలను కూడా విడుదల చేయవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించారు. కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రైతు భరోసానిధులను విడుదల చేయడానికి అనుమతించింది. ఈ ధోరణిలో చూస్తూ ఉంటే భయం అనేది కూటమికి ఏర్పడిందా లేక వైసిపి పార్టీగా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

# సుగంధ ద్రవ్యాల్లో క్రిమి సంహారకాల స్థాయి 10 రెట్లు పెంపు




న్యూఢిల్లీ : సుగంధ ద్రవ్యాల్లో క్రిమి సంహారక మందుల అవశేషాల పరిమాణాన్ని పెంచుతూ భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) గ్రీన్ సిగల్ ఇచ్చింది. గరిష్ట అవశేష పరిమితి (ఎంఆర్ఎల్)ని పది రెట్ల వరకు పెంచింది. ఈ పెరుగుదల కిలోగ్రాము(కేజీ)కు 0.01 మిల్లిగ్రాము(ఎంజీ)ల నుంచి 0.1 ఎంజీకి పెంచింది. ఇది గతంలో అనుమతించిన స్థాయి, పరిమాణం కంటే అధికం కావటం గమనార్హం. ఈ పెరుగుదలపై పలువురు మార్కెట్, ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక మొత్తంలో క్రిమిసంహారకాల వినియోగం క్యాన్సర్కు దారి తీయవచ్చని హెచ్చరిస్తున్నారు. ఈ సడలింపు కారణంగా కొన్ని పెద్ద మార్కెట్లకు భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతులు ఎక్కువగా తిరస్కరించబడతాయని పెస్టిసైడ్ యాక్షన్ నెట్వర్క్ సిఇఒ దిలీప్ కుమార్ తెలిపారు. అధికమొత్తంలో పెస్టిసైడ్ కలిగి ఉన్న సుగందద్రవ్యాల దిగుమతి సులభతరం కానున్నదని చెప్పారు. తమకు అందిన పలు విజ్ఞప్తుల ఆధారంగానే పెస్టిసైడ్ పరిమితిని పెంచినట్టు ఎఫ్ఎస్ఎస్ఎఐ తెలిపింది. అలాంటి విజ్ఞప్తులు ఎవరు చేశారన్నదాని గురించి మాత్రం సంస్థ వెల్లడించలేదు. క్రిమిసంహారకాల అవశేషాల పరిమాణం పెంచిన కారణంగా సుగంధద్రవ్యాలను వినియోగించేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం, సుస్థిర ఆహారాభివృద్ధి డైరెక్టర్ అమిత్ ఖురానా హెచ్చరించారు. సుగంధ ద్రవ్యాల్లో అధిక పెస్టిసైడ్ల వినియోగం కారణంగా కొన్ని ప్రముఖ బ్రాండ్లకు చెందిన అమ్మకాలపై హాంగ్కాంగ్, సింగపూర్, మాల్దీవులు గతనెల నిషేధం విధించాయి. భారత్కు చెందిన ఒక కంపెనీ మాత్రం తమ బ్రాండ్ అమ్మకాలపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చింది. ఆహార పదార్థాల్లో క్రిమి సంహారక మందుల అవశేషాలకు అత్యంత కఠినమైన నిబంధనలు ఆమోదించిన దేశాల్లో భారత్ ఒకటని ప్రభుత్వం ఆదివారం తెలిపింది. సుగంధ ద్రవ్యాల్లో అత్యంత ఎక్కువగా క్రిమిసంహారక అవశేషాలు వుండేందుకు ఆహార నియంత్రణా సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ అనుమతించిందని వస్తున్న వార్తలను కొట్టిపారేసింది. భారతదేశంలో రెండు ప్రఖ్యాతిచెందిన బ్రాండ్లు ఎండిహెచ్, ఎవరెస్ట్లకు చెందిన కొన్ని మాసాల మిక్స్ శాంపిల్స్లో క్రిమిసంహారక మందు ఎథిలిన్ ఆక్సైడ్ వుందంటూ హాంకాంగ్ ఫుడ్ రెగ్యులేటర్ వాటిపై నిషేధం విధించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ వివరణ ఇచ్చింది. ఎవరెస్ట్ బ్రాండ్కి చెందిన ఒక మసాలా ఉత్పత్తిని ఉపసంహరించాలని సింగపూర్ ఫుడ్ రెగ్యులేటర్ కూడా ఆదేశించింది. దేశీయ మార్కెట్లలో విక్రయిస్తున్న ఎండిహెచ్, ఎవరెస్ట్లతో సహా వివిధ బ్రాండ్లకు చెందిన నమూనాలను ప్రస్తుతం ఎఫ్ఎస్ఎస్ ఎఐ సేకరిస్తోంది. ప్రభుత్వం విధించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా అవి వున్నాయా? లేదా? అని తనిఖీ చేస్తోంది. ఎగుమతి చేసే మసాలాల నాణ్యతను ఇది నియంత్రించలేదు.

# మీ గొంతు జాగ్రత్త...! బీ అలెర్ట్... అంటున్న నిపుణులు.




అది ఇది ఏమని అన్నిరంగములనేలేస్తూ.. మానవాళి మనుగడకు ప్రశ్నార్థకంగా మారిందా అనిపిస్తోంది. కృత్రిమ మేధ రంగంలో కంపెనీల మధ్య రోజురోజుకు పోటీ పెరుగుతోంది. దాంతో వినియోగదారులకు మెరుగైన సేవలందించేం దుకు నిత్యం కంపెనీలు తమ ఉత్పత్తుల్లో మార్పు లు చేస్తూన్నాయి. తాజాగా ఓపెన్ఏఐ వాయిస్ అసిస్టెంట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఈ కొత్త ఫీచర్లో భాగంగా వాయిస్ ఇంజిన్ అనే వినూత్న టూల్ను పరిచయం చేసింది. వ్యక్తుల గొంతులను అచ్చం అలాగే తిరిగి వినిపించడం దీని ప్రత్యేకత. కేవలం 15 సెకండ్ల నిడివి రికార్డు స్పీచ్ సాయంతోనే గొంతులను అనుకరించటం విశేషం. అంటే ఒకరకంగా దీన్ని మిమిక్రీ ఇంజిన్ అనుకోవచ్చు. ఇది మంచి టూలే అయినప్పటికీ దీన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉండటం వల్ల ప్రస్తుతానికి ఎంపికచేసిన కొందరు టెస్టర్లకే అందుబాటులోకి తెచ్చారు. మనదేశంలో ఎన్నికలు జరుగుతుండటం.. ఇటీవల ఏఐ సృష్టించిన రాజకీయ నాయకుల గొంతులతో రోబో కాల్స్ పుట్టుకొస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండటం అవసరం. నిజానికి ఇప్పటికే చాలా అంకుర సంస్థలు వాయిస్ క్లోనింగ్ సొల్యూషన్లను అందిస్తున్నాయి. వీటి విషయంలో ఓపెన్ఏఐ నైతికతకు ప్రాధాన్యం ఇవ్వటం విశేషం. వాయిస్ ఇంజిన్ను పరీక్షించటానికి అనుమతి పొందినవారూ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే. ఆయా వ్యక్తుల అనుమతి తీసుకున్న తర్వాతే వారి గొంతులను సృష్టించటానికి వీలుంటుంది. అలాగే అవి ఏఐ ద్వారా సృష్టించినవని తప్పకుండా ప్రకటించాలి.

## ఏపీ పాలిటిక్స్లో ఓ హాట్ టాపిక్.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్..!

(1వ పేజీ తరువాయి)

రాష్ట్ర ట్రైబ్యునల్ తీర్పు మీద అభ్యంతరాలు ఉంటే హైకోర్టును కూడా ఆశ్రయించే అవకాశం ఉంటుంది. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రకారం భూ యజమానిని ఒకసారి నిర్ధారిస్తే అదే ఫైనల్ అవుతుంది. అయితే అంత ఈజీగా దీనిని నిర్ధా రించరు. ఇలా రిజిస్టర్ అయిన తర్వాత ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రెండేళ్లలో చెప్పాలి. రెండేళ్లలో అభ్యంతరాలు చెప్పకపోతే ఇక కోర్టుకు వెళ్లినా లాభం ఉండదు. ఇవి చట్టం డిటెయిల్స్ మరి వివాదం ఎందుకు? ఎందుకు అనుమా నాలు వస్తున్నాయి? ఎందుకంటే.. ప్రస్తుతం ఏపీలో ఈ యాక్ట్ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. అది కూడా సెలెక్ట్ చేసిన 16 రిజిస్ట్రార్ ఆఫీసుల్లో మాత్రమే చేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కావడంతో నమోదు చేసిన తర్వాత ఒరిజినల్ కాకుండా జిరాక్స్లు ఇస్తున్నారు. ఇక్క డ మొదలైంది పంచాయితీ.. ఈ అంశమే ఎన్నికల అస్త్రంగా మారింది. ఈ చట్టం ద్వారా వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆస్తులను కొట్టేసే ప్రయత్నం చేస్తోందని మరోసారి జగన్ అధికారంలోకి వస్తే... మీ భూములను కొట్టేస్తారంటూ విపక్షాలు విమర్శలు మొదలుపెట్టాయి. ప్రజలను గందరగోళానికి గురి చేసేందుకే అలాంటి ప్రచారాలు చేయిస్తున్నారంటూ వైసీపీ నేతలు కౌంటర్స్ ఇస్తున్నారు. 2019లో కేంద్రం దీనిపై కమిటీ వేసిందని దాన్ని వైసీపీపై రుద్దేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందన్నది వైసీపీ నేతల కౌంటర్లు. అంతా బాగుంది. ఇది నిజంగా కేంద్రంలోని బీజేపీ సర్కార్ నిర్ణయమే.. ఇదీ నిజమే.. కానీ వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఈ చట్టాన్ని ఎందుకు అమలు చేస్తుంది? వివాదస్పదం అని తెలిసి కూడా కొరివితో ఎందుకు తలగొక్కుంటుంది? ఏ రాష్ట్రమూ చేయని సాహసం వైసీపీ ప్రభుత్వమే ఎందుకు చేస్తుంది? అనేది ఇక్కడ బిగ్ క్వశ్చన్.. ఇది కావాలనే పొలిటికల్ రచ్చను రాజేసే ఉద్దేశమా? లేక ఈ చట్టంపై విపక్షాలపై విమర్శలు చేయించి.. కూటమిలో బీటలు తెచ్చే ప్రయత్నమా? అనేది ఇప్పుడు ఇంట్రెస్టింగ్ పాయింట్.. మొత్తానికి ఎన్నికల వరకు విపక్షం ఎన్ని విమర్శలు చేసినా వైసీపీ ఆగేలా కనిపించడం లేదు. అధికార పక్షం ఎంత క్లారిటీ ఇచ్చినా విపక్షం ఆగేట్టు కనిపించడం లేదు. దీనిపై ఓ క్లారిటీ రావాలంటే అది మే 13 తర్వాతేనని మేధావివర్గం భావిస్తోంది.!

# నేతల ఆస్తులూ పెరిగాయి.. దేశం పురోగమిస్తోంది..!



భారతదేశం నిజంగానే పురోగమనిస్తూ ఉంది. ఇందుకు ఆధారాలు కావాలా.. దేశంలో ఎన్నికల ప్రక్రియను గమనిస్తే చాలు, భారతదేశం ఆర్థికంగా ఎంత పురోగమిస్తోందో అర్థం చేసుకోవచ్చు! విశేషం ఏమిటంటే.. అధికారం, ప్రతిపక్షం వంటి హోదాలతో నిమిత్తం లేకుండా దేశంలో రాజకీయ నేతందరి ఆస్తులూ పెరిగాయి గత ఐదు సంవత్సరాల్లో! ఎన్నికల వేళ పోటీకి వారు దాఖలు చేస్తున్న ఆస్తుల అఫిడవిట్ లే ఇందుకు సాక్ష్యం! 2019 ఎన్నికల్లో ఈ నేతలు దాఖలు చేసిన ఆస్తుల అఫిడవిట్ కూ 2024 ఎన్నికల సందర్భంగా వీరు దాఖలు చేస్తున్న ఆస్తుల అఫిడవిట్ కు మధ్య వ్యత్యాసం భారీగా ఉంది! ఆ ఎన్నికల్లో పోటీ చేసి, నేటి ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతి ఒక్క ఎంపీ అభ్యర్థి, ప్రతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆస్తులూ భారీ స్థాయిలోనే పెరిగాయి! ఈ విషయంలో ఏ పార్టీ అభిమానులూ నొచ్చుకోనక్కర్లేదు! అందరి ఆస్తులూ పెరిగాయి! ఎవ్వరూ బాధపడనక్కర్లేదు, తమ అభిమాన పార్టీ ప్రతిపక్షంలో ఉండటం వల్ల తమ వారు సంపాదించుకోలేకపోయారేమో అని! అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. నేతలందరి ఆస్తులూ సమస్థాయిలో పెరిగాయి. అధికారికంగా వారు వెల్లడించిన వివరాల ప్రకారమే.. ప్రతి ఒక్కరి గ్రోత్ భారీ స్థాయిలో ఉంది! అధికారంలో లేని వాళ్లు ఐదేళ్లుగా గగ్గోలు పెట్టారు. తమ పై కక్ష సాధింపు చర్యలని, తమను అన్ని రకాలుగానూ దెబ్బతీయాలనే ప్రయత్నం చేస్తూ ఉన్నారంటూ అధికారంలో ఉన్న వారిపై ప్రతిపక్షంలో ని వారు గగ్గోలు పెట్టారు. అయితే వారి వ్యక్తిగత ఆస్తుల వరకూ వస్తే.. ఎలాంటి క్షీణతా లేదు! పైపెచ్చు భారీగా ఆస్తులు పెరిగాయి కూడా! దేశంలో అనేక మంది లోక్ సభ నియోజకవర్గాల అభ్యర్థులు తమ ఆస్తులను వేల కోట్ల రూపాయల్లో చూపించారు. ప్రధానంగా నగరాలు, నగర సమీపాల్లోని నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఆస్తులు అయితే.. ఆయా శివారు ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగినట్టుగా పెరిగిపోయాయి! బెంగళూరు సిటీలో భాగమైన ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న డీకే సురేష్, హైదరాబాద్‌కు ఒకవైపు ఆవరించి ఉన్న చేవెళ్ల నియోజకవర్గంలోని అభ్యర్థుల ఆస్తులు కళ్లు చెదిరే స్థాయిలో నమోదయ్యాయి. వీరిలో కొందరు ఐదేళ్ల నుంచి ప్రతిపక్షంలో ఉన్నా.. తమ ఆస్తుల్లో మంచి గ్రోత్ నే నమోదు చేశారు! ఈ ఎన్నికలు ఇస్తున్న క్లారిటీ ఏమిటంటే.. ప్రతిపక్షంలో ఉన్నంత మాత్రానా రాజకీయ నేతల ఆస్తులకు వచ్చిన లోటేమీ లేదు అని! అధికారంలో ఉన్న వారి ఆస్తులూ అధికారికంగా పెరిగాయి, ప్రతిపక్షంలో ఉన్న వారి ఆస్తులూ ఏ మాత్రం లోటు లేకుండా అధికారికంగా భారీ స్థాయికే చేరాయి! మరి ప్రతిపక్షంలో ఉన్న వారు అధికార పక్షంలో ఉన్న వారిపై దుమ్మెత్తి పోస్తూ.. అసలు దేశం నాశనం అయిపోయిందని, రాష్ట్రం నాశనం అయిపోయిందని, సామాన్యులు బతికే పరిస్థితి లేదని, వ్యాపారస్తులు వ్యాపారం చేసుకునే పరిస్థితి లేదని, ఎలాంటి అభివృద్ధి లేదని.. దీని వల్ల ఎలాంటి గ్రోత్ లేకుండా పోయిందని, ఫలితంగా కొత్తగా ఉద్యోగాలు కల్పించే పరిస్థితి లేకుండా పోతోందని, అధికారంలో ఉన్న వారి వల్ల ప్రభుత్వ, ప్రైవేట్ వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయని, ఫలితంగా రాష్ట్ర ప్రగతి, దేశ ప్రగతి కుంటుబాటులో సాగుతోందనే ఆవేధన వ్యక్తం చేస్తూ ఉన్నారు! అయితే ఎన్నికల వేళ వారి వ్యక్తిగత ఆస్తులను వెల్లడిస్తూ మాత్రం.. భారీ గ్రోత్‌ను నమోదు చేశారు! మరి దేశం కుంటుబాటున సాగుతూ ఉంటే, రాష్ట్రాలు మందగమనంలో పడిపోతే.. ప్రతిపక్షంలోని నేతల ఆస్తులు మాత్రం ఎలా పెరిగాయో వారే చెప్పాల్సి ఉంది! మళ్లీ మన రాజకీయ నేతల కుటుంబ వ్యాపారాలు ఏమిటంటే.. పాలమ్మినాం, పూలమ్మినాం.. అంటారు కానీ, ఒక్కోరి ఆస్తులు మాత్రం వందలు, వేల కోట్ల రూపాయల స్థాయిలో ఉన్నాయి! పార్టీల వారీగా చూస్తే.. ఇప్పటి వరకూ వివిధ దశల ఎన్నికల కోసం నామినేషన్లను దాఖలు చేసిన ఎంపీ అభ్యర్థుల్లో బీజేపీ తరఫు వారిలో ఏకంగా 90 శాతం మంది కోటీశ్వరులే! కాంగ్రెస్ పార్టీ ఏమీ తీసిపోలేదు. కాంగ్రెస్ పార్టీ తరఫున కూడా దాదాపు ఇదే స్థాయిలో కోటీశ్వరులు ఎంపీ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. ఎంపీల ఆస్తుల్లో వందల కోట్లు అనేది పెద్ద విషయం కాకుండా పోయింది. కొందరు ఎంపీ అభ్యర్థులు తమ ఆస్తులు నాలుగు వందల కోట్లు, ఐదొందల కోట్లు అని ప్రకటిస్తే... అంతేనా అని సామాన్య జనం అనుకునే పరిస్థితి ఏర్పడింది. చాలామంది తమ ఆస్తులను వేల కోట్ల రూపాయలని చెబుతూ ఉంటే, వందల కోట్లు చిన్న నంబర్లుగా అయిపోయాయి. ఇక తమ ఆస్తులు పదుల కోట్ల రూపాయలే అని చెబుతున్న వారిని చూసి, అయ్యోపాపం అని సానుభూతి వ్యక్తం చేసే పరిస్థితి దేశంలో కనిపిస్తూ ఉంది! ఇక దేశంలో యథారీతిన ఎన్నికల ఖర్చులు కూడా ఈ సారి భారీగా పెరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల విషయంలోనే భారీగా ఎన్నికల ఖర్చు ఉంటోంది. లోక్ సభ ఎన్నికలు మాత్రమే జరుగుతున్న రాష్ట్రాల్లో ఓటుకు ఇచ్చే నోటు కాస్త చిన్నదే అనే మాట వినిపిస్తోంది. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలు కలిసి జరుగుతున్న ఏపీ వంటి చోట.. ప్రధాన పార్టీల తరఫున బరిలో దిగుతున్న ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి కనీస ఖర్చు 40 కోట్ల రూపాయల నుంచి 50 కోట్ల వరకూ ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతూ ఉన్నాయి! ఇలా దేశం తన ఆర్థిక శక్తిని చాటుకుంటూ ఉంది!

## పౌరసరఫరాల శాఖకు భారీగా సర్కారు బకాయిలు

పౌర సరఫరాల సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బరదుల్లో కొట్టుమిట్టాడుతోంది. చేసిన ఖర్చులకు నిధులు రాక, ప్రభుత్వం నుంచి సహకారం లేక అప్పుల ఊబిలో చిక్కుకుపోతోంది. కనీసం ప్రభుత్వం నుండి రావాల్సిన సబ్సిడీ నిధులు కూడా రాకపోవడం గమనార్హం. అంతకు మించి భవిష్యత్తులో చేయాల్సిన ఖర్చు, అందుకు కావాల్సిన నిధులు భారీగా ఉండడంతో ఏమిచేయాలో పాలుపోని పరిస్థితికి చేరుకుంది. వచ్చే సెప్టెంబర్ వరకు ఏకంగా 34,393 కోట్లు అవసరమవుతాయని పౌర సరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు. అయితే అంత సొమ్ము ప్రభుత్వం ఇచ్చే అవకాశం ఏలనది, అప్పులకు వెళ్లాల్సివస్తుందని అంటున్నారు.. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పలు రంగాలకు పౌర సరఫరాల సంస్థ అందించిన బియ్యం, గోధుమలు, చక్కెర, పప్పులు వంటి వాటికి ప్రభుత్వం సబ్సిడీ భరించాలి. అయితే ఇప్పటివరకు 380 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి రాలేదని అధికారులు చెబుతున్నారు. అలాగే వచ్చే సెప్టెంబర్ వరకు మరో 4251 కోట్లు ప్రభుత్వం ఇవ్వాలని వారంటున్నారు. ఇక గత బకాయిలు కూడా భారీగానే ఉన్నాయి. ఇది కాక మరో ఎనిమిది విభాగాల్లో ఏకంగా 22,019 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ఇందులో బియ్యం సబ్సిడీ బకాయిలు ఏకంగా 12,083 కోట్లు వరకు ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే 2023–24 సంవత్సరానికి కేంద్ర సాయంలో రాష్ట్ర వాటా 105 కోట్లు, పిఎస్ గరీబ్ కల్యాణ యోజన కిరద 4028 కోట్లు, సంస్థ తీసుకున్న వేస్ అండ్ మీన్స్ బకాయిలు 4326 కోట్లు, ఐసిడిఎస్ నుంచి 603 కోట్లు, విద్యాశాఖ నుంచి 578 కోట్లు, తుపానులు, గిరికానుక, కొవిడ్ సమయాల్లో చేసిన నిత్యావసరాల సరఫరాకి 112 కోట్లు, ఇతర సంక్షేమ శాఖల నుంచి 183 కోట్లు రావాల్సి ఉందని సంస్థ అధికారులు చెబుతున్నారు. కాగా ధాన్యం సేకరణ, రవాణా, ఇతర సేకరణ అంశాలకు రూ. 5,425 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఇందులో ఒక్క ధాన్యం సేకరణకే 4,406 కోట్లు కావాల్సి ఉంటుందని చెబుతున్నారు. అలాగే 2 శాతం మార్కెట్ రుసుము, కూలీలకు చెల్లింపులు, రవాణా, వడ్డీలు. మిల్లుల ఛార్జీలు, పాలనా వ్యయం, గన్నీ సంచుల కొనుగోలు, సరుకు నిల్వ వంటి ఇతర రంగాలకు మరికొంత నిధులు అవసరమవుతాయి. గత ధాన్యం సేకరణలో రైతులు, మార్కెటింగ్ శాఖ, ఇతర రంగాలకు చెల్లించాల్సింది రూ. 2,318 కోట్లవరకు ఉందని అధికారులు చెబుతున్నారు. మొత్తం మీద బకాయిలు రూ. 34 వేల కోట్లు దాటిపోవడంపై పౌర సరఫరాల సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అలాగే సంస్థ ఇప్పటివరకు తీసుకున్న అప్పులే 36 వేల కోట్ల వరకు ఉన్నాయి. ఈ రుణాలపై ప్రతి నెలా ఏకంగా 280 కోట్ల రూపాయలను వడ్డీగా చెల్లించాల్సి వస్తోంది.

## రోత రాజకీయంతో.. ప్రజాస్వామ్యం అపహాస్యం!

ఆధునిక ప్రపంచ చరిత్రలో అనేక దేశాలు రాచరికానికి స్వస్తి పలికి పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశాలుగా అవతరించాయి. ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశాలలో ప్రజల చేత ప్రజల కొరకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ప్రతినిధులుగా మారి రాజ్యాన్ని పాలిస్తారు. ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమైనది. కొన్ని ప్రజాస్వామ్య దేశాలు ద్విపార్టీ వ్యవస్థను ఎంచుకోగా.. మరి కొన్ని దేశాలు బహుళ పార్టీ వ్యవస్థను ఎన్నుకున్నాయి. స్వాతంత్ర్యానంతరం ప్రపంచ బాటలో నడిచిన భారతదేశం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, బహుళ రాజకీయ పార్టీల విధానాన్ని ఎంచుకోంది. ఈ బహుళపార్టీ విధానంలో వ్యక్తులు.. వివిధ పార్టీలకు ప్రాతినిధ్యం వహించి ఎన్నికలలో పోటీ చేసి గెలిచి వివిధ సభలకు, వివిధ పార్టీల తరుపున ప్రాతినిధ్యం వహిస్తారు. అయితే ఇటీవల కాలంలో వివిధ పార్టీలకు ప్రాతినిధ్యం వహించి వివిధ సభలకు గెలిచిన సభ్యుల ప్రవర్తన సభ్య సమాజం సిగ్గుపడేలా ఉంది. వారి నడవడిక ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉంది. వారు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియదు. ఎప్పుడు పార్టీని ఫిరాయిస్తారో తెలియదు. వీరికి ప్రజాతీర్పుతో పనిలేదు. వీరికి సిద్ధాంతాలు అంటూ ఉండవు. నైతిక విలువలు తెలియవు. సర్వస్వం అధికారమే పరమావధి. తమను గెలిపించిన పార్టీని వదిలి తమ స్వలాభం కోసం ఇంకో పార్టీలోకి ఫిరాయిస్తుంటారు. ఈ విధంగా ఎన్నికైన సభ్యుల పార్టీ ఫిరాయింపులను నిరోధించడానికి, రాజకీయాలలో అవినీతిని అరికట్టడానికి, సుస్థిర ప్రభుత్వ ఏర్పాటుకు, పరిపాలనలో స్థిరత్వం తీసుకురావడానికి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, 1985లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రూపొందించింది. అయితే, ఈ చట్టంలోని కొన్ని లొసుగుల కారణంగా ఎన్నికైన సభ్యుల పార్టీ ఫిరాయింపులు యథేచ్ఛాగా కొనసాగుతూనే ఉన్నాయి. 1970 దశకం చివరి వరకు దేశ ప్రజా స్వామ్యంలో పార్టీ ఫిరాయింపులనే సంస్కృ తి లేదు. ఆ తర్వాత ఏర్పడిన రాజకీయ పార్టీల వలనే నేడు అది మూడు పువ్వులు ఆరు కాయ లుగా విలిసిల్లుతూ భారత ప్రజాస్వామ్యానికి ఒక చెదలాగా తయారైంది. ఈ పార్టీ ఫిరాయింపులకు కారణాలు అనేకం ఉన్నాయి. కానీ అధికారం కోసం, అక్రమ ఆస్తుల రక్షణ కోసం, డబ్బు కోసం ఆశపడి ప్రలోభాలకు లొంగి ఒక పార్టీ నుంచి ఇంకొక పార్టీలోకి ఫిరాయిస్తున్నారు. ప్రజలు తమను విశ్వాసంతో గెలిపిస్తే వారు పార్టీ మారి దానిని సొమ్ము చేసుకుంటున్నారు. అందుకే నేటి ఈ పరిస్థితి మారాలంటే ప్రజల ఆలోచన విధానంలో మార్పు రావాలి. ఒకసారి పార్టీ మారి న వారిని ఇంకోసారి ఎన్నికల్లో గెలిపించకూడదు. ఎటువంటి ప్రలోభాలకు లొంగని నైతిక సామా జిక విలువలు గల వారిని ఎన్నికల్లో గెలిపించాలి. ధనవంతులను పారిశ్రామికవేత్తలను కాకుండా ఉన్నత విద్యావంతులను చట్టసభలకు పంపాలి. ప్రభుత్వాలు పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పటిష్టంగా మార్చాలి. అప్పుడే ఈ దేశంలో అసలైన ప్రజాస్వామ్యం వెలసిల్లుతుంది. పార్టీ ఫిరాయింపులకు చెల్లు చీటిపడుతుంది. లేదంటే ఈ రోత రాజకీయంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుంది.

# సైబర్ వల భద్రం జర



* ఇన్సూరెన్స్, పెట్టుబడులు, కస్టమర్ కేర్ అంటూ మోసాలు
* అమ్మాయిలతో డేటింగ్ అంటూ చీటింగ్
* బాధితుల్లో అత్యధికులు విద్యావంతులు, ఉద్యోగులే

క్రెడిట్ లేదా డెబిట్ కార్డు బ్లాక్ అవుతుంది.. కేవైసీ అప్‌డేట్ చేయాలంటూ ఓటీపీ చెప్పమంటారు. నిజమేనని చెప్పగానే క్షణాల్లో బ్యాంకు ఖాతాలో డబ్బు మాయమవుతుంది. మేము ఆర్మీ అధికారులం. తక్కువ ధరకే వస్తువులు ఇస్తాం. కావాలంటే గూగుల్ పే, ఫోన్‌పే చేయండి అంటూ ఆర్మీ సెంటిమెంట్ చూపించి వంచన. మీకు అమ్మాయితో పరిచయం కావాలని ఉందా? ఏకాంతంగా గడపాలని ఉందా? అని మెస్సేజ్‌లు వస్తుంటాయి. వెంటనే స్పందించి ఫోన్లు చేస్తే తొలుత రిజిస్ట్రేషన్ ఫీజు, ఆ తర్వాత అమ్మాయిలతో మాట్లాడించి అందినకాడికి లాగేస్తుంటారు. ఉచితం, తక్కువ ధరలు, గిఫ్ట్‌ల పేరుతో ఆగడాలు అప్‌డేట్, లాటరీ అంటూ డబ్బు మాయం సాంకేతికత అనూహ్యంగా పెరగడంతో అదేస్థాయిలో సైబర్ మోసాలు పెచ్చరిల్లుతున్నాయి. అమాయకత్వం, అత్యాశ, పక్కవారితో చర్చించకపోవడం, సులువుగా వస్తుందనే ధోరణి, సెంటిమెంట్లు గుడ్డిగా నమ్మి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి విలవిలలాడుతున్నారు. ఏదీ కష్టపడకుండా రాదనే విషయాన్ని విస్మరించి అతి సులువుగా మోసపోతున్నారు. ఇలా మోసపోయి, జేబులు గుల్ల చేసుకుంటున్న వారిలో యువతతోపాటు ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులు ఉంటుండడం సైబర్ నేరాల పెరుగుదలకు పరాకాష్ట. ఏదీ ఊరికే రాదు.. కష్టపడకుండా డబ్బు వస్తుందనే ఆశ నుంచి బయటపడడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. సాంకేతికత ఏ స్థాయిలో పెరిగిందో.. దానిని ఆధారం చేసుకొని అదే రీతిలో నేరాల సంఖ్య సైతం రెట్టింపవుతున్నది. కొంచెం కంప్యూటర్ పరిజ్ఞానం.. మాయమాటలతో కూర్చున్న చోట నుంచే అంతర్జాల ఆగంతకులు కోట్లు కొల్లగొడుతూ.. ఖాతాలు సున్నా చేస్తున్నారు. ఇందులో బాధితుల పొరపాట్లే ఎక్కువ ఉంటున్నాయి. అందులోనూ చదువుకున్న వాళ్లే మోసపోవడం దిగ్భ్రాంతి పరిచే అంశమే. అవగాహన లోపంతో కొందరు.. అత్యాశకు పోయి మరికొందరు.. సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుకొని తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే మనం కాస్త అప్రమత్తతతో వ్యవహరిస్తే..మోసాన్ని గ్రహించవచ్చు. కేటుగాళ్ల వలలో పడకుండా.. తప్పించుకోవచ్చు. బ్యాంకు అధికారులమని, మీ డెబిట్ కార్డు త్వరలో బ్లాక్ అవుతుందని, కేవైసీ అప్‌డేట్ చేయాలని ఫోన్లు చేస్తారు. బ్యాంకు అధికారులు అనే సరికి చాలా మంది నమ్మి అడిగిన సమాచారం ఇస్తారు. కార్డు వివరాలు తీసుకున్నాక.. బాధితుల సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీని తమకు చెప్పాలని సూచిస్తారు. బ్యాంకింగ్ అధికారులెవరూ.. ఫోన్ చేసి మీ వివరాలు అడుగరు. అలా ఎవరైనా చేశారంటే.. బ్యాంకుకు వచ్చి చెబుతామంటూ.. కాల్ కట్ చేయాలి. ఓటీపీ అనేది సీక్రెట్‌గా ఉండాల్సింది. అలాంటిది ఫోన్‌లో అడిగే వారికి ఎలా చెబుతారు. ఓటీపీ చెప్పేస్తే..డబ్బు సైబర్‌నేరగాళ్ల చేతిలోకి వెళ్తుంది. ఒకవేళ మోసపోతే బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి, కార్డు బ్లాక్ చేయించి, సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేవైసీ అప్‌డేట్ చేయాలి, బ్యాంకు అధికారులమంటూ ఫోన్లు చేస్తుంటారు. కేవైసీ అప్‌డేట్‌కు సాయం చేస్తామంటూ.. ఎనీడెస్క్, క్విక్ సపోర్టు వంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేయిస్తారు. ఆ ప్రక్రియ పూర్తయ్యాక ఒక కోడ్ వస్తుంది. దానిని తమకు చెప్పాలని అడుగుతారు. అవగాహన లేకపోవడంతో చాలా మంది కోడ్‌ను చెప్పేస్తుంటారు. ఆ తర్వాత రిమోట్ యాప్‌తో సైబర్‌నేరగాళ్లు మన సెల్‌ఫోన్‌ను నియంత్రణలోకి తీసుకుంటారు. ఆ యాప్‌లతో మన చేతిలో ఉండే సెల్‌ఫోన్‌ను ఎక్కడి నుంచైనా.. ఆపరేట్ చేసేందుకు వీలుంటుంది. బ్యాంకింగ్ లావాదేవీలు చేయిస్తారు. మన ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ వివరాలు తీసుకొని ఖాతాలు ఖాళీ చేస్తారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ ఫోన్‌లో ఫలానా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని చెప్పారంటే అది మోసమని అనుమానించాలి. రిమోట్ యాప్‌లను ఉపయోగించి మీ ఖాతాలు ఖాళీ చేశారంటే ..వెంటనే బ్యాంకుకు ఫోన్ చేసి ఖాతాను స్తంభింప చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కొందరు ఇంటర్‌నెట్‌లో జాబ్స్ కోసం వెతుకుతూ వివిధ ప్రకటనలు క్లిక్ చేస్తూ, వివరాలు పొందుపరుస్తుంటారు. అలా డేటా సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కుతుంది. మీకు జాబ్ కావాలా? ఫలానా చోట ఉద్యోగం ఉందంటూ నమ్మించి మీ దగ్గర రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి మొదలు పెట్టి అందిన కాడికి లాగేస్తారు. ఫేక్ ఇంటర్వ్యూలు, ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లు పంపించి చీటింగ్ చేస్తుంటారు. డిజిటల్ పేమెంట్స్, వస్తువు కొనుగోళ్లు, అమ్మకాల్లో ఏదైనా సమస్య వస్తే..ఆయా సంస్థలకు సంబంధించిన కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేయడం, అనుమానాన్ని నివృత్తి చేసుకోవడం సహజంగా నడిచే ప్రక్రియ. ఇప్పుడు ఇదే సైబర్‌నేరగాళ్లకు వరంగా మారింది.

# తిరుపతి జిల్లాలో వైసిపి, టిడిపి ముమ్మర ప్రచారం


* తగ్గేదేలే అంటున్న ఇండియా బ్లాక్



తాజా ఎన్నికలు తిరుపతి జిల్లాలో హోరెత్తిస్తున్నాయి. జిల్లాలో తిరుపతి లోక్‌సభ స్థానంతో పాటు సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి అసెంబ్లీ స్థానాలున్నాయి. పోలింగ్‌కు ఇక వారం రోజులే ఉండడంతో ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. సంక్షేమానికే మళ్లీ అధికారం ఇస్తారని వైసిపి శ్రేణులు భావిస్తుండగా, సంక్షేమంలో పక్షపాతం, అభివృద్ధి లేమి, ఉపాధి అవకాశాలు లేకపోవడం వంటి అంశాలు తమకు విజయావకాశాలుగా కలిసి వస్తాయని టిడిపి–జనసేన–బిజెపి కూటమి శ్రేణులు చెపుతున్నారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వంతో పాటు వైసిపి, టిడిపి ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ఎలా దెబ్బకొట్టాయో ఇండియా బ్లాక్ అభ్యర్థులు ఓటర్లకు వివరిస్తున్నారు. తిరుపతి ఎంపి స్థానానికి సిట్టింగ్ వైసిపి ఎంపి మద్దిల గురుమూర్తి బరిలో ఉన్నారు. తాను మూడేళ్ల కాలంలో చేసిన అభివృద్ధే గెలిపిస్తుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు వైసిపి ఎంఎల్‌ఎ వరప్రసాద్‌కు టిక్కెట్ రాకపోవడంతో బిజెపిలో చేరి ఆ పార్టీ తరపున తిరుపతి ఎంపిగా బరిలో దిగారు. ఇండియా బ్లాక్ తరపున కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ పోటీలో ఉన్నారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజలను అంటిపెట్టుకోవడం వల్ల తనకే గెలుపు అవకాశాలు ఉన్నాయని మోహన్ చెపుతున్నారు. తిరుపతిలో డిప్యూటీ మేయర్ భూమన అభినరురెడ్డి వైసిపి అభ్యర్థిగా రంగంలోకి దిగారు. గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందని ఆయన చెపుతున్నారు. చిత్తూరు వైసిపి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులుకు ఆ పార్టీలో టిక్కెట్ రాకపోవడంతో జనసేన తరపున పోటీ చేస్తున్నారు. తొలుత కూటమిలో లుకలుకలు బహిరంగంగా కనిపించినా..ఆ తరువాత మూడు పార్టీల నేతలూ ప్రస్తుతం ప్రచారంలో భాగస్వాములవుతున్నారు కాంగ్రెస్ వేదిక నుంచి సిపిఐ అభ్యర్థి పి.మురళి పోటీ చేస్తున్నారు. చంద్రగిరిలో వైసిపి నుంచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పోటీచేస్తున్నారు. తన తండ్రి భాస్కర్‌రెడ్డి గత పదేళ్లుగా చేసిన విస్తృతమైన ఆర్థిక, సామాజిక సేవలే తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. టిడిపి అభ్యర్థి పులివర్తి నాని కూటమిదే గెలుపన్న ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి రెండోసారి డాక్టర్ వాసు పోటీ చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి టిడిపి నుంచి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి వైసిపి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. బియ్యపు అనుచరులు చేసిన భూకబ్జాలు, అక్రమాలే తమను గెలిపిస్తాయని సుధీర్‌రెడ్డి చెపుతున్నారు. శ్రీకాళహస్తిలో తాను చేసిన అభివృద్ధే తనను మరోసారి గెలిపిస్తుందని నమ్మకంతో బియ్యపు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న పోతుగుంట రాజేష్‌నాయుడు టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి వలస రావడంతో టిడిపి ఓట్లు చీలే అవకాశం ఉంది. సత్యవేడులో ఎంఎల్‌ఎ ఆదిమూలంకు వైసిపి టిక్కెట్ రాకపోవడంతో సైకిల్ ఎక్కారు. మంత్రి పెద్దిరెడ్డి తనపై కక్షగట్టి వైసిపిలో టిక్కెట్ రాకుండా చేశారని ప్రచారం చేసి సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. వైసిపి తరపున పోటీలో ఉన్న నూకతోటి రాజేష్ 'నాన్ లోకల్' అనే చర్చ ఉంది. టిడిపి టిక్కెట్లు రాకపోవడంతో జెడి రాజశేఖర్, రమేష్‌లు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉండడంతో టిడిపి ఓట్లు చీలే అవకాశం ఉంది. కాంగ్రెస్ నుంచి బాలగురు బాబు పోటీలో ఉన్నారు. సూళ్లూరుపేటలో నెలవల విజయశ్రీ టిడిపి నుంచి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ కిలివేటి సంజీవయ్య వైసిపి నుంచి విస్తృత ప్రచారం గావిస్తున్నారు. సంజీవయ్య కబ్జాలు, అవినీతి అక్రమాలే తమను గెలిపిస్తాయని టిడిపి ధీమా. వైసిపికి బలమైన మండలాలు సూళ్లూరుపేట, నాయుడుపేట, పెళ్లకూరుల్లో 'పెద్దలు' ఆశీస్సులు తనకే ఎక్కువగా ఉన్నాయని సంజీవయ్య చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి సూళ్లూరుపేటకు చెందిన శివ పోటీలో ఉన్నారు. వెంకటగిరిలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, టిడిపి తరపున మాజీ ఎంఎల్‌ఎ కురుగొండ్ల రామకృష్ణ హోరాహోరీగా తలపడుతున్నారు. పంటా శ్రీనివాసులు కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్నారు. వైసిపి ఓట్లే చీల్చే అవకాశం కనిపిస్తోంది. గూడూరులో టిడిపి నుంచి పాశం సునీల్ కుమార్, వైసిపి నుంచి మేరిగ మురళీ మధ్య పోటాపోటీ ప్రచారం జరుగుతోంది. వైసిపి నుండి తమ పార్టీలో చేరికలతో తమ గెలుపు సునాయాశమని సునీల్‌కుమార్ చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి డాక్టర్ రామకృష్ణ పోటీలో ఉన్నారు. కోట పరిసర ప్రాంతాల్లో వైసిపికి పడే ఓట్లలో కొన్ని డాక్టర్ రామకృష్ణకు పడే అవకాశం ఉంది.

# పెరుగుతున్న ఇ.సి. ఎన్నికల నిర్వహణ వ్యయం

ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల భారత దేశంలో ఎన్నికల ప్రక్రియ భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారం. ఇంత విస్తారమైన జనాభాకు ఓటింగ్ నిర్వహించడానికి ప్రణాళిక అవసరం. సుమారు 97 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఈ ప్రక్రియలో అటు మానవవనరులతో పాటు ఇటు ఆర్థిక వనరులూ అవసరం. కొన్నేళ్లుగా లోక్‌సభ ఎన్నికల నిర్వహణా ఖర్చులు క్రమంగా పెరుగుతున్నాయి. 1952లో ఎన్నికల కమిషన్ ఒక్కో ఓటరుకు 60 పైసల ఖర్చు చేసింది. ఇది అభ్యర్థులు సొంతంగా చేసిన వ్యయం కాదు. ఇ.సి. చేసిన ఖర్చు. తర్వాతి రెండు ఎన్నికల్లో ఆ ఖర్చును 30 పైసలకు తగ్గించింది. ఆ తదుపరి ఖర్చు 40 పైసలకు పెరిగింది. 1980లో ఇ.సి. ఖర్చు ఒక్కో ఓటరుకు రూ.1కి పెరిగింది. 2004లో రూ.17 కు చేరింది. 2009లో రూ.13కు తగ్గినా 2014లో ఒకేసారి మూడింతలు పెరిగి రూ.41.6 అయింది. ప్రస్తుతం సుమారు 60 రూపాయలవుతోందని ఒక అంచనా. 1951-52 మొదటి సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలింగ్ వ్యయం రూ.10.5 కోట్లయింది. 2014లో వ్యయం రూ.3,870 కోట్లు. తొలి






ఎన్నికలకు ఇప్పటికీ ఓటర్ల సంఖ్య పెరుగుదల, అందుకనుగుణంగా నిర్వహణా ఏర్పాట్లకు చేసే ఖర్చూ పెరుగుతూ వస్తోంది. అధికారులు, సాయుధ బలగాల మొహరింపు, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవిఎం), ఇంకు, అవగాహన కార్యక్రమాలు, సోషల్ మీడియా ప్రచారం వంటి వాటిపై ఎన్నికల కమిషన్ ఖర్చు చేస్తుంది. వీటన్నింటిలో ఈవిఎంలకు ఎక్కువ ఖర్చు పెడుతోంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రిపోర్ట్ ప్రకారం ఈవిఎంల వినియోగంపై ఖర్చు గణనీయంగా పెరుగుతోందని వెల్లడించింది. 2019 బడ్జెట్‌లో కేంద్రం ఈవిఎంలపై రూ.25 కోట్లు కేటాయించింది. 2023 తాజా బడ్జెట్‌లో ఈవిఎంల కోసం రూ.1891 కోట్లు కేటాయించింది. కిందటి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రూ.611 కోట్ల గ్రాంట్‌ల కోసం అదనపు డిమాండ్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. 1979- హెూం మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం లోక్‌సభ ఎన్నికల ఖర్చును కేంద్రమే భరిస్తుంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి జరిగే రాష్ట్రాల్లో ఎన్నికల ఖర్చును కేంద్రం రాష్ట్రాలు సమానంగా పంచుకుంటాయి. ఏడు దశల్లో జరిగే ఈ సార్వత్రిక ఎన్నికల వ్యయం గత లోక్‌సభ ఎన్నికల కంటే భారీగా పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల ప్రకటన జారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు 82 రోజుల పాటు ప్రక్రియ కొనసాగనుంది. ఎలక్షన్ ప్రక్రియలో అధికారుల శిక్షణా తరగతులకు రోజుకు రూ.350, పోలింగ్ సిబ్బందికి రోజుకు రూ.250 చొప్పున చెల్లిస్తున్నట్లు తాజా ఉత్తర్వులో ఈసి వెల్లడించింది. తొలి ఎన్నికల్లో 1,874 మంది అభ్యర్థులు 53 పార్టీల నుంచి పోటీలో ఉండగా 1,96,000 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. అదే 2019లో 8,054 అభ్యర్థులు, 673 పార్టల నుంచి పోటీచేయగా పదిలక్షల పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల పెరుగుదల, అభ్యర్థులు, ఓటర్ల, ఈసి సిబ్బంది పెరుగుదల వంటివి బడ్జెట్ పెంపునకు దారి తీస్తున్నాయి.

# పోలింగ్ దగ్గర పడుతున్న కొద్ది బెట్టింగుల జోరు...!

ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న కొద్ది బెట్టింగుల జోరు ఊపందుకుంది. ప్రతి నియోజకవర్గంలోనూ అభ్యర్థి గెలుపు, మెజార్టీలపై పందేలు హెూరెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. జిల్లాలతో పని లేకుండా ప్రతి జిల్లాలోనూ ఈ బెట్టింగుల ప్రక్రియ హోరెత్తిపోతుందనడంలో అతిశయోక్తి లేదు. 2014 ఎన్నికల్లో కూడా బెట్టింగు రాయుళ్ళ హవానే కొనసాగిందని, వారి ప్రమేయంతోనే పలు నియోజకవర్గాల్లో విజయం సాధించగలిగారనే ఆరోపణలు వున్నాయి. అదేవిధంగా నేడు కూడా ఎన్నికల ఫలితాలను శాసించే స్థాయిలో బెట్టింగులు కొనసాగుతున్నట్లు సమాచారం. పెద్దమొత్తంతో సంబంధం లేకుండా వంద రూపాయల నుంచి కోటి రూపాయల దాకా బెట్టింగ్ రాయుళ్ళు పందెం కాస్తున్నారంటే... గెలుపుమీద వారి ధీమా ఏస్థాయిలో వుందో ఇట్టే అర్థమైపోతుంది. ఈ విషయం గోప్యంగా ఉండటంవల్ల పోలీసులకు, ఎన్నికల కమిషన్‌కు తగిన సమాచారం లేకపోవడంతో ఈ బెట్టింగుల ప్రక్రియ యథేచ్ఛగా సాగిపోతోందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఆయా నియోజకవర్గాల ఓటర్లను కొనుగోలు చేసి గెలుపు - ఓటములను శాసించగలిగే స్థాయిలో బెట్టింగ్ రాయుళ్ళు ఉన్నారనేది గత ఎన్నికలు రుజువుచేసిన అంశం. సమీకరణల అనంతరం పార్టీలతో ప్రమేయం లేకుండా తమకు రావు అనుకున్న, జఠిలంగా వున్న ఓటర్ల విషయంలో అధిక మొత్తాలను వెదజల్లేందుకు బెట్టింగు రాయుళ్ళే నిధులు వెచ్చిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అధికారం



కావాలి కాబట్టి అధికారాన్ని సంపాదించుకునేందుకు ఎన్ని అడ్డదారులైనా తొక్కేందుకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలకు ఈ బెట్టింగ్ రాయుళ్ళు పక్కబలంగా ఉపయోగపడుతున్నారు. 50 కోట్లు బెట్టింగులో గెలుపొందగలిగే పరిస్థితిని సృష్టించి పాతిక కోట్లరూపాయలు ఓటర్లమీద వెదజల్లినప్పటికీ మరో పాతిక కోట్లు మిగులుతుంది కదా అనే అంచనాతో బెట్టింగురాయుళ్ళు రెచ్చిపోతున్నారు. అయినప్పటికీ చట్టాన్ని కాపాడి అక్రమాలను అరికట్టాల్సిన పోలీసు వ్యవస్థ, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ రెండూ కూడా ఈ విషయంలో కనీస చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని పలువురు విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో బెట్టింగుల జోరు ఊపందుకుంది. అక్కడా, ఇక్కడా అనే తేడా లేకుండా ప్రతి నియోజకవర్గంలోనూ పందేలు సాగుతున్నాయి. ఇది చాపక్రింద నీరులా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి అన్ని నియోజకవర్గాల్లో నిరాఘాటంగా రాజకీయం రసవత్తరంగా మారడంతో పందెం రాయుళ్లు అదేస్థాయిలో రెచ్చిపోతున్నారు. ఫలానా పార్టీ అభ్యర్థి గెలుస్తారంటూ పందేలు సైతం వేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యధిక పందేలు అభ్యర్థి గెలుపుపై సాగుతుండగా, అభ్యర్థి గెలుస్తాడన్న ధీమా ఉన్న నియోజకవర్గాల్లో మెజార్టీపైనా పందేలు కాస్తున్నారు. ఎన్నికల పందేల్లో విచిత్రమైన పరిస్థితి కన్పిస్తోంది. ఒక పార్టీ అభిమానులు తమ వ్యతిరేక పార్టీ అభ్యర్థి గెలుస్తుందని పందేలు కాస్తుండటం గమనార్హం. ముఖ్యంగా వివిధ సంస్థలు విడుదల చేస్తున్న సర్వేల ఆధారంగా పందేల జోరు ఊపందుకుంటుంది. ప్రతి నియోజకవర్గంలోనూ నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. ఆర్థికంగా బలమైన అభ్యర్థులు కావడంతో గెలుపుపై ఇరువురు ధీమాగా ఉన్నారు. దీంతో ఇక్కడ అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా పందేలు సాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ రూ.20 కోట్లకుపైగా పందేలు ఉంటాయని అంచనా. కొంతమంది ఒక్కటిగా కలిసి తలోకొంత వేసుకుని పందేలు కడుతున్నారు. మధ్యవర్తుల ద్వారా ఈ పందేలు సాగుతున్నట్లు సమాచారం. పందేలు కాసేవారు మధ్యవర్తిని కలిసి చెబితే అతను వేరొకరిని పందేనికి ఏర్పాటు చేస్తున్న పరిస్థితులు సాగుతున్నాయి. ఈ పందేల విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాజకీయ రంగంలో కార్పొరేట్ శక్తులు ప్రవేశించటంతో ఆర్థిక బలాబలాలే ప్రధాన అంశంగా పోటీ నెలకొంది. పార్టీ ప్రమేయం లేకుండా ఇరు పార్టీలు కూడా ధనవంతులను మాత్రమే తమ అభ్యర్థులుగా ప్రకటించడం వల్ల ఎవరు స్థాయి మేరకు తమ ఆర్థిక స్తోమతను ఉపయోగించి గెలుపొందాలని పోటీపడటంతో పందెంరాయుళ్ళకు పెద్ద అవకాశంగా మారింది. సర్వేలను, గతంలో సాధించిన విజయాలను బేరీజు వేసుకొని బెట్టింగురాయుళ్ళు అత్యుత్సాహంతో, అతి నమ్మకంతో కోట్లాది రూపాయలు బెట్టింగుకు వెచ్చిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో గెలుపు - ఓటములను కూడా వారే నిర్ధారించే స్థాయికి వెళ్లిపోవటంతో ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ నవ్వులపాలు అవుతోందని మేధావి వర్గం విమర్శిస్తోంది. ఏది ఏమైనప్పటికీ చట్టం తన పని తాను చేయాల్సిన బాధ్యత మరచిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి ఎన్నికల కమిషన్, పోలీస్ వ్యవస్థ బెట్టింగ్‌రాయుళ్ళపై ఉక్కుపాదం మోపి కఠినచర్యలు చేపట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజలు ఆశిస్తున్నారు. ఇక బెట్టింగ్‌రాయుళ్ళ ఆనందం వేచిచూడాల్సిందే..! వీరి ఆట వీరు మొదలుపెట్టారు... అంతిమంగా వీరి జయాపజయాలు జూన్ 4 సాయంకాలానికి వేచి చూడాల్సిందే..!

Edited, Printed, Published and Owned by Shaik Ghouse Basha, Printed at Mohammed Press, D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001, Andhra Pradesh, Publihsed at D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001. Andhra Pradesh,
Editor : Shaik Ghouse Basha Cell : 9640300529